బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 07 నవంబర్-2026

balagamtv100@gmail.com

పేజీలు-8

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 161 కొత్త పీజీ సీట్లు



మిగతా 2లో..

మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట



మిగతా 2లో..

కీలక ఖనిజ రంగంలో అమెరికన్ సంస్థలతో
భాగస్వామ్యానికి సింగరేణి సిద్ధం

- సింగరేణి సీఎండీతో అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధుల భేటీ
- జియో సైన్స్ ల్యాబ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌పై అమెరికా బృందం ఆసక్తి
- పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు పెట్టుబడుల ఆహ్వానం
- తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటుపైనా చర్చలు
- ఏప్రిల్‌లో అమెరికాలో జరిగే కీలక ఖనిజ సదస్సుకు సింగరేణికి ఆహ్వానం

వివరాలు 3లో..

తెలంగాణ ఆదాయ వనరుల బలోపేతానికి సమగ్ర కార్యాచరణ

- ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను గడువులోగా సాధించాలి
- ల్యాండ్ పూలింగ్, భూముల వేలంపై ప్రత్యేక దృష్టి
- పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం
- దరఖాస్తుల పరిష్కారానికి వారాలవారీగా లక్ష్యాలు



3లో..

- భూముల వివరాల పర్యవేక్షణకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్‌బోర్డ్

2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం : ఉత్తమ్

- క్రాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోంది
- స్రంక్షేమ పథకాలతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం
- క్రార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలి
- ప్రట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి



వివరాలు 4లో..

మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట



- విద్య, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత
- హజ్‌హౌస్ పక్కన అసంపూర్తి భవన నిర్మాణానికి రూ.25 కోట్లు
- విదేశీ విద్యా అవకాశాల పరిధిలోకి ఈజిప్ట్, సౌదీ అరేబియా
- మైనార్టీ విద్యార్థుల స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు చర్యలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2లో..

పోలీసుల ఆరోగ్య భద్రతకు 'ఫిట్ కాప్'

- 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికి ఆరోగ్య పర్యవేక్షణ
- ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి వైద్య సూచనలు
- పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మెరుగైన సేవలు: డీజీపీ సీవీ ఆనంద్

2లో..

ప్రభుత్వ పథకాల అమలులో కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలి



- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి
- తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- మార్చి 2027 నాటికి 11 కోట్ల ఉపాధి పనిదినాల లక్ష్యం
- చేయూత పింఛన్ల పెండింగ్ దరఖాస్తుల పరిశీలన నవంబర్ రెండో వారంలోగా పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి
- సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, నవంబర్ 6:
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమం వంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లు మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం, ప్రభుత్వ ప్రతిష్ట పెంపొందించేలా కృషి చేయాలనివిలువనిచ్చారు.సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.. విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, భూసేకరణ శాఖల పరిధిలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. కలెక్టర్లు జిల్లాల్లోని విద్యాసంస్థలు, ఆసుపత్రులు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో కలెక్టర్లు చేస్తున్న కృషిని అభినందించారు. ఇటీవల తుఫాను ప్రభావిత ప్రాంతంలో చోటుచేసుకున్న ప్రమాద సమయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ సకాలంలో స్పందించి ఎస్‌డీఆర్ ఎఫ్ బృందాన్ని రక్షించిన తీరును ప్రత్యేకంగా ప్రశంసించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు



ఎల్‌నినో నేపథ్యంలో ఏర్పడే ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలోని 565 మండలాల్లో ఆవాసాల వారీగా నీటి ఎద్దడి పరిస్థితులను అంచనా వేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీటి

వివరాలు 3లో..

గ్రామపంచాయతీల సొంత ఆదాయం ఇక నేరుగా ఖాతాల్లోకే!

- చట్ట సవరణ అమలుకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు
- ట్రెజరీకి వెళ్లకుండా పంచాయతీ ఖాతాల్లోనే నిధుల జమ
- గ్రామాల అభివృద్ధి పనులకు నిధుల వినియోగంలో వేగం
- పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలక ముందడుగు: మంత్రి సీతక్క



వివరాలు 3లో..

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

- మంత్రి తుమ్మల
- నవంబర్ 7 నుంచి 9 వరకు హకీంపేటలో మెగా రైతు మేళా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- 150 ప్రదర్శన స్టాళ్లు.. 10 జిల్లాల నుంచి 50 వేల మంది రైతుల హాజరు
- ఆధునిక యంత్రాలు, డ్రోన్లు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
- లగచర్లలో ఎకో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి సీఎం శంకుస్థాపన



వివరాలు 3లో..

పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా
తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం

- యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత:
- మంత్రి శ్రీధర్ బాబు
- హైదరాబాద్‌లో పికో టెక్నాలజీ ఇండియా ప్రధాన కార్యాలయం ప్రారంభం
- గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ-సమ్మిట్‌గా ఇండియన్ రోడ్ కాంగ్రెస్



హైదరాబాద్, నవంబర్ 6:
తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు నైపుణ్యానికి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో పికో టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని పికో ఫౌండర్, సీఈఓ జారోడ్ యస్టర్, ఏఐసీఓ జి. సీతారాం, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శ్రీధర్ బాబు ప్రారంభించారు.

వివరాలు 3లో..

ఫీజులు తీసుకుని సర్టిఫికెట్లు ఆపేస్తారా?

- నల్ల మల్లారెడ్డి స్కూల్‌పై గద్వాల విజయలక్ష్మి సీరియస్
- 10వ తేదీలోగా విద్యార్థినుల సర్టిఫికెట్లు అందేలా చూడాలి-RJDకి స్పష్టం
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం.. ఇతర విద్యాసంస్థలు జాగ్రత్త
- ఇలాంటి ప్రవర్తనను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా..



- ఇలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతా

వివరాలు 2లో..

గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు కేంద్రంగా హైదరాబాద్

- మంత్రి శ్రీధర్ బాబు
- గ్లోబల్ కంపెనీల కార్యకలాపాల విస్తరణకు పూర్తి సహకారం
- ఏడాదిలో 100 కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటే లక్ష్యం
- జీసీసీలను గ్లోబల్ టెక్నాలజీ అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం
- పికో టెక్నాలజీ ఇండియా కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు



హైదరాబాద్, నవంబర్ 6:
హైదరాబాద్‌ను గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అంతర్జాతీయ కంపెనీలు తమ కీలక కార్యకలాపాలు, పరిశోధన, ఉత్పత్తుల అభివృద్ధికి హైదరాబాద్‌ను ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకునేలా

వివరాలు 3లో..

ఢిల్లీలో విషవాయువుల కమ్మేసిన వాతావరణం

- 391కు చేరిన AQI!
- చాలా పేలవమైన స్థాయికి పడిపోయిన గాలి నాణ్యత
- పలు ప్రాంతాల్లో తీవ్ర కాలుష్యం



న్యూఢిల్లీ, నవంబర్ 6: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర రూపం దాల్చుతోంది. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. నవంబర్ 6 ఉదయం నాటికి 24 గంటల సగటు గాలి నాణ్యత సూచీ (AQI) 391గా నమోదైంది. దీంతో ఢిల్లీ గాలి నాణ్యత 'వెరీ పూర్' (చాలా పేలవమైన) కేటగిరీలో కొనసాగుతోంది.నగరంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి మరిం త ఆందోళనకరంగా మారింది. జహంగీర్‌పురిలో అత్యధికంగా 459 AQI నమోదు కాగా, ఐటీ ఢిల్లీ, పంజాబీ బాగ్ ప్రాంతాల్లో 445 చొప్పున నమోదైంది. ఐటీఓ, ద్వారక, రోహిణి, అలీపూర్, బావనా తదితర ప్రాంతాల్లోనూ కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది.పంట వ్యర్థాల దహనం నుంచి వెలువడే పొగ, వాహనాల నుంచి వచ్చే కాలుష్యం, గాలుల వేగం తగ్గడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు కాలుష్యం పెరగడానికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. పంజాబ్, హర్యానా ప్రాంతాల నుంచి వచ్చే పొగతో పాటు ఇతర కాలుష్య కారకాలు ఢిల్లీ గాలిని కలుషితం చేస్తున్నాయి.కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (+ూ్రా-2) నిబంధనలను అమలు చేస్తోంది. పరిస్థితి మరింత దిగజారితే కృత్రిమ వర్షం కురిపించే అవకాశాలను కూడా పరిశీలిస్తోంది. మరోవైపు చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఢిల్లీలో కాలుష్య నియంత్రణ చర్యలపై ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసిన బండారు దత్తాత్రేయ



- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు దీపావళి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, నవంబర్ 6: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం న్యూఢిల్లీలో పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌లతో ఆయన భేటీ అయ్యారు. వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవల్లో ఇబ్బందులు ఉండకూడదు



- ఎన్ఈహెచ్ఎస్ అమలుపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- పథకం పరిధిలోని రోగులకు ఆసుపత్రుల్లో అడ్మిషన్లు నిరాకరించవద్దు
- పెండింగ్ బిల్లులను త్వరగా పరిష్కరించాలి
- వైద్య చికిత్సల ధరల్లో పారదర్శకత, ఏకరూపత ఉండాలి

హైదరాబాద్, నవంబర్ 6: న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అమలులో ఉద్యోగులు, పెన్షనర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఎన్ఈహెచ్ఎస్ బోర్డు సమావేశంలో ఉన్నతాధికారులు, బోర్డు సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి పథకం అమలు తీరును సమీక్షించారు. ఆసుపత్రుల్లో అడ్మిషన్లు, వైద్య చికిత్సలు, బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఉద్యోగ సంఘాల నాయకులు లేవనెత్తిన సమస్యలపై చర్చించారు. అనంతరం యశోద, అపోలో, కిమ్స్ తదితర కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో ఆన్‌లైన్‌లో మాట్లాడిన సీఎస్.. ఉద్యోగ సంఘాల నాయకులు చేసిన ఫిర్యాదులపై వివరణ కోరారు. ఎన్ఈహెచ్ఎస్ పరిధిలోని రోగులకు ఎట్టి పరిస్థి తుల్లోనూ ఆసుపత్రుల్లో అడ్మిషన్లు నిరాకరించకూ డదని స్పష్టం చేశారు.పెండింగ్‌లో ఉన్న పాత బిల్లులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, చికిత్సలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆసుపత్రుల ప్రతినిధులకు సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.వైద్య చికిత్సల ధరల్లో పారదర్శకత, ఏకరూపత ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధరలను క్రమబద్ధీకరిం చడంతో పాటు జవాబుదారీతనాన్ని పెంపొందిం చాలని అధికారులను ఆదేశించారు. చికిత్సల ఛార్జీల నిర్ణయంలో సీజీహెచ్ఎస్ నిర్దేశించిన ధరలను ప్రాతిపదికగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బి.ఎం.డి. ఎక్కా, నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శులు క్రిష్టినా చోంగ్తు, యోగితా రాణా, శిఖా గోయల్, సర్ఫరాజ్ అహ్మద్, గౌరవ్ ఉప్పల్, శృతి ఓజా, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ, ఇతర ఉన్నతాధికారులు, బోర్డు సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 161 కొత్త పీజీ సీట్లు

- 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 విభాగాలకు ఎన్ఎంసీ అనుమతులు
- 163 సీట్లకు ప్రతిపాదనలు పంపితే.. 161 సీట్లకు ఆమోదం
- మెరిట్ విద్యార్థులకు పీజీ వైద్య విద్య మరింత చేరువ



అమరావతి, నవంబర్ 06 : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య విద్యను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 161 కొత్త పీజీ వైద్య సీట్లను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. మొత్తం 15 వైద్య విభాగాల్లో ఈ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 163 సీట్ల కోసం ప్రతిపాదనలు పంపగా, 161 సీట్లకు అనుమతులు లభించాయి. దీంతో 98.77 శాతం లక్ష్యాన్ని సాధించినట్లయింది.ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధనా సిబ్బంది నియామకాలు, పడకల పెంపు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడంతో అదనపు సీట్లు మంజూరయ్యాయి. ఈ నిర్ణయంతో మెరిట్ విద్యార్థులకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్య అభ్యసించే అవకాశాలు మరింత పెరగనున్నాయి.

ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు

విభాగాల వారీగా ఆర్థోపెడిక్స్‌లో అత్యధికంగా 27 సీట్లు మంజూరయ్యాయి. డీవీఎల్, ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో 16 చొప్పున, రేడియో డయాగ్నోసిస్‌లో 14, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీలో 12 చొప్పున సీట్లు లభించాయి. జనరల్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తాల్మాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్ విభాగాల్లో 8 చొప్పున, ఎమర్జెన్సీ మెడిసిన్, ప్రసూతి-గైనకాలజీ, సైకియాట్రీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల్లో 4 చొప్పున సీట్లు మంజూరయ్యాయి.ముఖ్యంగా ఎమర్జెన్సీ మెడిసిన్, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్యం, క్యాన్సర్ చికిత్స వంటి కీలక రంగాల్లో వైద్య నిపుణుల సంఖ్య పెరిగేందుకు ఈ సీట్లు దోహదపడనున్నాయి.మంజూరైన 161 సీట్లను 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

గత ఏడాది 142 సీట్లకు అనుమతి

గత విద్యా సంవత్సరంలో 13 ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి 150 పీజీ వైద్య సీట్ల కోసం ప్రతిపాదనలు పంపగా, ఎన్ఎంసీ పరిశీలన అనంతరం 142 సీట్లకు అనుమతులు మంజూరు చేసింది. ఈ ఏడాది 161 సీట్లు సాధించడం ప్రభుత్వ వైద్య విద్యా రంగంలో మరో ముందడుగుగా నిలిచింది.

మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- మైనార్టీ విద్యార్థుల స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు చర్యలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 6: మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మైనార్టీల సంక్షేమంతో పాటు విద్యా అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధా న్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా హైదరా బాద్ ఓల్డ్ సిటీ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయి స్తున్నట్లు వెల్లడించారు.గత అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ప్రజా భవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో విద్య, సంక్షేమ పథకాలు, విద్యా సంస్థల నిర్మాణాలు, స్టడీ సర్కిళ్లు, ఓల్డ్ సిటీ అభి వృద్ధిపై సమగ్రంగా చర్చించారు. మైనార్టీ విద్యా ర్థుల విద్యాభివృద్ధికి నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం ఉండదని భరోసా ఇచ్చారు.

హజ్‌హౌస్ పక్కన భవన నిర్మాణానికి రూ.25 కోట్లు

నాంపల్లిలోని హజ్‌హౌస్ పక్కన కొన్నేళ్లుగా అసం పూర్తిగా నిలిచిపోయిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. రహదారుల విస్తరణ కోసం వినియోగించిన వక్ఫ్ భూములకు సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి వక్ఫ్ బోర్డుకు రావాల్సిన నిధు ల్లో రూ.25 కోట్లను ఈ భవన నిర్మాణానికి కేటాయి ంచాలని సూచించారు.ఈ భవనంలో మైనార్టీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్‌తో పాటు మైనార్టీ సంక్షేమ శాఖకు చెందిన వివిధ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యాసంస్థల భవన నిర్మాణాల బిల్లులను సకాలంలో చెల్లించాలని, పాఠశాలలు, స్టడీ సర్కిళ్లకు అవసరమైన నిధులను విడుదల చేయాలని ఆదేశించారు.

మొఘల్‌పురా, బండ్లగూడలో స్టడీ సర్కిళ్లు

మొఘల్‌పురా, బండ్లగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన రెండు స్టడీ సర్కిళ్లకు ఉన్న అడ్డంకులను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచిం చారు. ఈ స్టడీ సర్కిళ్ల నిర్వహణకు అవసరమైన భవ నాలను అందించేందుకు ఎంఐఎం శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సంసిద్ధత వ్యక్తం చేయగా, ఇందుకు సంబంధించిన ప్రతిపాద నలు అధికారికంగా సమర్పించాలని కోరారు.

విదేశీ విద్యకు మరిన్ని అవకాశాలు

మైనార్టీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పరిధిని విస్తరించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం కింద విదేశాల్లో చదువు కునేందుకు అర్హులైన విద్యార్థులు వెళ్లగలిగే దేశాల జాబితాలో ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మైనార్టీ సంక్షేమ పథకాలపై సమీక్ష

షాదీ ముబారక్ పథకం, ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు, రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విడుదల తదితర అంశాలపై సమీక్షించారు. క్రైస్తవ మైనార్టీల సమస్యలను కూడా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.మైనార్టీల విద్యా, సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శి బి. షఫీఉల్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలీసుల ఆరోగ్య భద్రతకు 'ఫిట్ కాప్'

- సమాజానికి మెరుగైన సేవలు: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, నవంబర్ 6: నిరంతర విధులు, పని ఒత్తిడి మధ్య పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపలేకపో తున్నారని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించగలరని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్‌తో పాటు ఇతర సంస్థల సహకారంతో రూపొందించిన ఈ కార్యక్ర మంపై శుక్రవారం డీజీపీ కార్యాలయంలో పోలీసు అధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌గా రూపొందించిన ఈ కార్యక్రమం ప్రత్యేక మొబైల్ యాప్ ఆధారంగా పనిచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది తమ మొబైల్ నంబర్ ఆధారంగా యాప్‌లో ఆరోగ్య వివరాలను నమోదు చేసుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), ఇతర ఆరోగ్య సమస్యలు, జీవ నశైలి అలవాట్లు, శారీరక శ్రమ, ధూమపానం, మద్య పా నం అంశాలపై సమాచారం సేకరి స్తారు. ఈ వివరాల ఆధారంగా సిబ్బందిని తక్కువ, మధ్యస్థ, అధిక ఆరోగ్య ముప్పు విభాగాలుగా గుర్తిస్తారు.

ఆరోగ్య సమస్యలపై ముందస్తు అప్రమత్తత

ఆరోగ్య ప్రమాద స్థాయిని బట్టి కాల్‌సెంటర్ ద్వారా సంబంధిత పోలీసు సిబ్బందికి సమాచారం అం దిస్తామని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థా పకుడు సల్మాన్ తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రుల్లో చికిత్స, ఆరోగ్య సల హాలు, కౌన్సెలింగ్ అందించేందుకు చర్యలు తీసుకు ంటామన్నారు. కిడ్నీ సమస్యలు, మధుమేహం, రక్తపోటు వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తిం చి తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని డీజీపీ వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

పోలీసు సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెం చడం, వ్యాధులు తీవ్రమవకముందే నివారణ చర్య లు చేపట్టడం ఫిట్ కాప్ ప్రధాన ఉద్దేశమని సీవీ ఆనంద్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు విభా గాల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేస్తా మని, ప్రతి పోలీసు ఉద్యోగి ఆరోగ్య పరిరక్షణలో ఫిట్ కాప్ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్య క్తం చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఏడీజీ అకున్ సబ ర్వాల్, ఐజీపీ పి. అండ్ ఎల్ గజరావు భూపాల్, భద్రత, ఆరోగ్య భద్రత కార్యదర్శి ఉదయ్ కుమార్ రెడ్డి (రిటైర్డ్), టి-స్వార్క్ ఎస్పీ రూపేష్, ఎస్పీ అవినాష్, ఇతర పోలీసు అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీజులు తీసుకుని సర్టిఫికెట్లు ఆపేస్తారా?

- నల్ల మల్లారెడ్డి స్కూల్‌పై గద్వాల విజయలక్ష్మి సీరియస్
- 10వ తేదీలోగా విద్యార్థినుల సర్టిఫికెట్లు అందేలా చూడాలి-RJDకి స్పష్టం
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం.. ఇతర విద్యాసంస్థలు జాగ్రత్త
- ఇలాంటి ప్రవర్తనను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా..
- ఇలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతా



హైదరాబాద్, నవంబర్ 6: ఫీజులు చెల్లించినప్పటికీ ఇద్దరు మైనర్ విద్యార్థినుల అకడమిక్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఫిర్యాదుపై ఘట్కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి తీవ్రంగా స్పందించారు.సీఎం ప్రజావాణిని ఆశ్రయించిన ఇద్దరు బాలికలు తమకు అవసరమైన సర్టిఫికెట్లు అందక చదువు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను స్వయంగా విన్న గద్వాల విజయలక్ష్మి వెంటనే స్కూల్ ఎడ్యుకేషన్ రాజేడీ సోమిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు."ఫీజులు చెల్లించిన తర్వాత కూడా పిల్లల సర్టిఫికెట్లు ఎందుకు నిలిపివేస్తున్నారు? వారి చదువు ఆగిపోయే పరిస్థితి రావడం ఏ మాత్రం సహించేది కాదు. 10వ తేదీలోగా వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలి" అని =జీణకి స్పష్టం చేశారు.ఈ సమస్య పరిష్కారం కాకపోతే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని గద్వాల విజయలక్ష్మి తెలిపారు.ఈ అంశంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు కూడా ఆమె అధికారికంగా లేఖ రాశారు. విద్యార్థినులకు అవసరమైన విద్యా ధ్రువపత్రాలను వెంటనే అందజేయడంతో పాటు, వారు చేసిన వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. "విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడకూడదు. ఫీజులు లేదా పరిపాలనా సమస్యల పేరుతో పిల్లల చదువును అడ్డుకోవడం సహించం. విచారణలో తప్పిదం నిర్ధారణైతే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పవు" అని గద్వాల విజయలక్ష్మి హెచ్చరిం చారు.రాష్ట్రంలోని ఇతర విద్యాసంస్థలు కూడా ఈ అంశాన్ని గమనించాలని, విద్యార్థులను వేధించడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం లేదా వారి విద్యకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని స్పష్టం చేశారు."పిల్లల చదువు ఆగకూడదు. వారి విద్యా హక్కు, భవిష్యత్తు విషయంలో సీఎం ప్రజావాణి రాజీపడదు" అని గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు.కాగా శుక్రవారంజరిగిన సీఎం ప్రజావాణిలో 83 దరఖాస్తులు అందాయి..

హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి బాధ్యతల స్వీకరణ

- ఉన్నత విద్య, ప్రజా పరిపాలనలో విశేష అనుభవం
- గతంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా సేవలు
- విద్యా, పరిశోధన కార్యక్రమాల అభివృద్ధిపై ఆశాభావం

హైదరాబాద్, నవంబర్ 06: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్, హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి బాధ్య తలు స్వీకరించారు. ఉన్నత విద్య, పరిపాలన, సంస్థాగత నాయకత్వ రంగాల్లో విశేష అనుభవం కలిగిన ఆయన నియామకంపై సంస్థ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఖ్రాజు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టకముందు ప్రొఫెసర్ లింబాద్రి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా, తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. విద్యా, బోధనా సంస్థలతో సుదీర్ఘ అనుబంధం కలిగిన ఆయన ఉన్నత విద్య, ప్రజా పరిపాలన రంగాల్లో విశేష సేవలందించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీ అంబుడ్స్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ప్రొఫెసర్ లింబాద్రికి ఉన్న విస్తృత విద్యా అనుభవం, పరిపాలనా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు ఖ్రాజు అభివృద్ధికి దోహదపడతాయని సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

సంపాదకీయం

పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం

ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణ వైపు ఆకర్షితులయ్యేలా అనుకూల పారిశ్రామిక వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం అందిస్తూ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. కొత్త సంస్థల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా గ్లోబల్ సమ్మిట్ పాలసీని తీసుకొచ్చామని, రాష్ట్ర పెట్టుబడి సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానించి రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను పరిచయం చేయనున్నట్లు చెప్పారు.

పెట్టుబడులు, సాంకేతికతకు హైదరాబాద్ కేంద్రం: కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణను పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ఐటీ, సాంకేతిక సంస్థలకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. పికో టెక్నాలజీ ఇండియా వంటి సంస్థలు నగరంలో ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువస్తుందని అన్నారు. పెట్టుబడులకు ముందుకొచ్చే సంస్థలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని, పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్‌కు ముందస్తు కార్యక్రమంగా ఇండియన్ రోడ్ కాంగ్రెస్

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ-సమ్మిట్ కార్యక్రమంగా ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. దేశవ్యాప్తంగా రహదారుల రంగానికి చెందిన నిపుణులు, ఇంజినీర్లు ఈ సమావేశాల్లో పాల్గొననున్నారని తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలులో కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలి



ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీ వారానికోసారి లేదా పక్షం రోజులకు ఒకసారి సమావేశమై తాగునీటి సరఫరాను సమీక్షించాలని ఆదేశించారు.

ఉపాధి పనిదినాల కల్పనలో రికార్డు

రాష్ట్రంలో ఇప్పటివరకు 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు సీఎస్ గుర్తు చేశారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం వీబీ-జీ రామ్ జీ పథకం కింద రోజుకు రికార్డు స్థాయిలో 5,38,215 పనిదినాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 2024లో రోజుకు 27,100, 2025లో 29,100 పనిదినాలు కల్పించగా, ప్రస్తుతం ఈ సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. 2027 మార్చి నెలాఖరుకు 11 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి ఆవాసంలో ఉపాధి పనులు తప్పనిసరిగా చేపట్టాలని, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖల సమన్వయంతో పనులు నిర్వహించాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన పనులన్నింటినీ వచ్చే ఏడాది జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పశుగ్రాసం లభ్యతకు ప్రాధాన్యతనిస్తూ దాని పెంపకానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, జలసిరి పథకం కింద ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

చేయూత దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

చేయూత పథకం కింద వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులకు సంబంధించి మొత్తం 5.9 లక్షల దరఖాస్తులు అందాయని సీఎస్ తెలిపారు. వీటిలో 38 వేల దరఖాస్తులు మినహా మిగిలిన వాటి పరిశీలన పూర్తయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనను నవంబర్ రెండో వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో మంజూరు చేసిన 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక బస్తా సిమెంట్ ధరను రూ.230గా నిర్ణయించినందున లబ్ధిదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా చూడాలన్నారు. గనుల శాఖ ఆధ్వర్యంలోని 'మన ఇసుక వాహనం' ద్వారా నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అందించాలని ఆదేశించారు. అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, రవాణా శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ వాల్యూ క్రియేషన్‌కు కేంద్రంగా హైదరాబాద్

అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్థలకు టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాఫ్ట్‌వేర్, డేటా, అనలిటిక్స్ సేవలు అందిస్తున్న పికో టెక్నాలజీ ఇండియా కార్యాలయాన్ని శుక్రవారం హైటెక్ సిటీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రారంభంలో పికో సంస్థ ప్రతినిధులతో హైదరాబాద్‌లో పెట్టుబడులు, సంస్థ కార్యకలాపాల విస్తరణపై జరిపిన చర్చలు కార్యరూపం దాల్చడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ కంపెనీల కార్యకలాపాల విస్తరణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. రాబోయే ఏడాది కాలంలో హైదరాబాద్‌లో 100 కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జీసీసీలను సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక రంగాల్లోనూ జీసీసీలు కీలక పాత్ర పోషించేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పికో సంస్థ ప్రపంచవ్యాప్తంగా 350కి పైగా సంస్థలకు సేవలు అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పికో టెక్నాలజీ హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించడం ద్వారా స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపకుడు, సీఈఓ జారోడ్ యూస్టర్, సీఐఓ సీతారాం గొర్రె, చీఫ్ పీపుల్ ఆఫీసర్ మాట్ నార్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రముఖుల హాజరుపై సీఎస్ సమీక్ష

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు గ్లోబల్ సమ్మిట్
- దేశంలోనే అతిపెద్ద బహుళ రంగాల ఎక్స్‌పోల్లో ఒకటిగా నిర్వహణ
- ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ ప్రతినిధుల భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి
- ఆహ్వానాలు, వచ్చిన అంగీకారాలపై సమీక్షించిన సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, నవంబర్ 6: డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ వ్యక్తుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు సమన్వయంతో కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు సూచించారు. సమ్మిట్‌కు ఆహ్వానాలు పంపిన ప్రముఖులు, వారి నుంచి వచ్చిన అంగీకారాల స్థితిగతులను ఆయన సమీక్షించారు.సీఎస్ మాట్లాడుతూ.. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ దేశంలోనే అతిపెద్ద బహుళరంగాల ఎక్స్‌పోల్లో ఒకటిగా నిలవనుందని తెలి పారు. తెలంగాణలోని విభిన్న పెట్టుబడి అవకాశాలు, పారిశ్రా మిక బలాలు, మౌలిక సదుపా యాలు, అభివృద్ధి చెందుతున్న నూతన రంగాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తుంద న్నారు.తెలంగాణను ప్రపంచ పెట్టు బడులకు అనుకూల మైన గమ్యస్థానంగా ప్రదర్శించడంతో పాటు, అంతర్జాతీయ పెట్టుబడుల రంగంలో రాష్ట్ర స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమ్మిట్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ వ్యక్తులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, ప్రపంచ పెట్టుబడిదారులు, జాతీయ స్థాయి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటే సదస్సు ప్రాధాన్యత, విస్తృతి మరింత పెరుగుతాయని తెలిపారు. ప్రముఖుల భాగస్వామ్యాన్ని ఖరారు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఆహ్వానితులతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ సమన్వయంతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

కీలక ఖనిజ రంగంలో అమెరికన్ సంస్థలతో భాగస్వామ్యానికి సింగరేణి సిద్ధం

- తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటుపైనా చర్చలు
- ఏప్రిల్‌లో అమెరికాలో జరిగే కీలక ఖనిజ సదస్సుకు సింగరేణికి ఆహ్వానం



హైదరాబాద్, నవంబర్ 6: కీలక ఖనిజాల అన్వేషణ, తవ్వకాలు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రంగాల్లో అమెరికన్ సంస్థలతో కలిసి పనిచేసేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ సిద్ధంగా ఉందని సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి వెల్లడించారు. ఈ రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు సింగరేణి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం అమెరికన్ కాన్సులేట్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సీఎండీతో సమావేశమైంది. ఈ సందర్భంగా కీలక ఖనిజ రంగంలో సాంకేతిక సహకారం, ఉమ్మడి పెట్టుబడులు, వ్యాపార అవకాశాలపై ఇరుపక్షాలు విస్తృతంగా చర్చించాయి.మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి ప్రస్తుతం కీలక ఖనిజాల రంగంలోకి విస్తరిస్తోందని సీఎండీ వివరించారు. ఇప్పటికే పలు దేశాలతో సాంకేతిక సహకారం, ఉమ్మడి భాగస్వామ్యంపై చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఈ రంగంలో మరింత ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. కొత్తగూడెంలో సింగరేణి ఏర్పాటు చేసిన జియో సైన్స్ ల్యాబొరేటరీలోని పరిశోధనా సదుపాయాలు, ఓపెన్‌కాస్ట్ గనుల ఓవర్‌బర్డెన్‌లో ఉన్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌పై అమెరికన్ ప్రతినిధులు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. అమెరికాలోని కీలక ఖనిజ రంగ సంస్థలతో కలిసి పనిచేసేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు. ఏప్రిల్‌లో అమెరికాలో నిర్వహించనున్న కీలక ఖనిజాల సదస్సుకు సింగరేణి ప్రతినిధులను ఆహ్వానించారు. అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాల అన్వేషణ కొనసాగుతోందని అమెరికన్ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణలో సింగరేణి కార్యకలాపాలు విస్తరించిన ప్రాంతాల్లోనూ డేటా సెంటర్ల ఏర్పాటుకు ఆసక్తి చూపించారు. మూతపడిన ఓపెన్‌కాస్ట్ గనులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సింగరేణి పలు ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని సంస్థ అధికారులు వివరించారు. ఈ ప్లాంట్ల ద్వారా డేటా సెంటర్లకు అవసరమైన పీక్ అవర్స్ విద్యుత్‌ను నిరంతరాయంగా అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. తగిన పెట్టుబడులు, భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులను చేపట్టవచ్చని పేర్కొన్నారు. సమీపంలోని గోదావరి నది నుంచి నీటిని వినియోగించుకునే అవకాశాలు కూడా ఉన్నాయని వివరించారు. తెలంగాణలో ఇప్పటికే పలు అమెరికన్ కంపెనీలు డేటా సెంటర్లను ఏర్పాటు చేశాయని, మరికొన్ని సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయని కాన్సులేట్ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అమెరికన్ ప్రతినిధి బృందాన్ని సింగరేణి గనులు, కొత్తగూడెం జియో సైన్స్ ల్యాబొరేటరీని సందర్శించాలని సీఎండీ ఆహ్వానించారు. ఈ సమావేశంలో అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధులు మెరెడిత్ మెజ్లర్, శ్రీమలి కరి, శిబా త్రిపాఠి, సునేల్ కుమ్మర్‌తో పాటు సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్లు టి. శ్రీనివాస్, కె. రామదాసు, పంకజ్ కులశ్రేష్ఠ, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరుల బలోపేతానికి సమగ్ర కార్యాచరణ

- ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను గడువులోగా సాధించాలి
- ల్యాండ్ పూలింగ్, భూముల వేలంపై ప్రత్యేక దృష్టి
- పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం
- దరఖాస్తుల పరిష్కారానికి వారాలవారీగా లక్ష్యాలు
- భూముల వివరాల పర్యవేక్షణకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్‌బోర్డ్

హైదరాబాద్, నవంబర్ 06: తెలంగాణ రాష్ట్ర ఆదాయ వనరులను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. ప్రభుత్వ భూములు, పారిశ్రామిక లేఅవుట్లు, ల్యాండ్ పూలింగ్, భూముల వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పారదర్శక విధానాలు, సమర్థవంతమైన వనరుల వినియోగంతో నిర్దేశిత ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువుల్లో సాధించాలని స్పష్టం చేశారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో భట్టి విక్రమార్క అధ్యక్షతన ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ప్రతి శాఖ స్పష్టమైన లక్ష్యాలతో వారాలవారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక లేఅవుట్లు, పాత పారిశ్రామిక వాడల్లో భూముల వినియోగం, క్రమబద్ధీకరణ ద్వారా ఆదాయం పెంచే మార్గాలపై సమీక్షించారు. అజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట పారిశ్రామిక ప్రాంతాల్లో యూనిట్లవారీగా భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. బీ-కేటగిరీ, సూక్ష్మ పారిశ్రామిక యూనిట్ల ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగేలా, ప్రభుత్వానికి అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పారిశ్రామిక యూనిట్ల దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఇందుకోసం వారాలవారీగా లక్ష్యాలు నిర్దేశించి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని పేర్కొన్నారు. వేగవంతమైన అనుమతులు, మెరుగైన వ్యాపార వాతావరణం ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా భూముల సమీకరణ, ల్యాండ్ పూలింగ్‌పై సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని భట్టి విక్రమార్క సూచించారు. ల్యాండ్ పూలింగ్‌లో పాల్గొనే అన్ని వర్గాలకు ప్రయోజనం కలిగేలా పారదర్శక విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు.ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి లభించే భూములను రోడ్లు, పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి ప్రజా అవసరాలకు ప్రాధాన్యమిస్తూ వినియోగించాలని స్పష్టం చేశారు. అసైన్డ్ భూములకు సంబంధించిన అంశాలను చట్టపరమైన నిబంధనలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పరిశీలించి తగిన ప్రతిపాదనలను మంత్రివర్గానికి సమర్పించాలని సూచించారు.హెచ్ఎండీఏ, టీజీఐఐసీ పరిధిలోని భూముల అభివృద్ధి, వేలం ద్వారా ఆదాయ సమీకరణ అవకాశాలను కూడా సమీక్షించారు. ప్రధాన రహదారులకు అనుసంధానం, అభివృద్ధికి అనుకూలత ఉన్న ప్రాంతాల్లో వేలానికి అనువైన లేఅవుట్లను గుర్తించాలని ఆదేశించారు. భూముల వివరాలు, లేఅవుట్ల స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్ల సమాచారంతో కూడిన కార్యాచరణ ప్రణాళికను వచ్చే వారంలోగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. ప్రభుత్వ భూములు, లేఅవుట్ల అభివృద్ధి, వేలం ప్రక్రియలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్ బోర్డును రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని వివరాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం ద్వారా పారదర్శకత, శాఖల మధ్య సమన్వయం పెరుగుతాయని పేర్కొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబర్ 06: ఆదాయాన్ని పెంచి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు.ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటలో మూడు రోజుల పాటు మెగా రైతు మేళా నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్ 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేళాను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ముఖాముఖి చర్చలు జరపడమే కాకుండా పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారని వివరించారు.నవంబర్ 8న ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. నవంబర్ 9న పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు పాల్గొనే భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారని వెల్లడించారు.రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించడమే మేళా ప్రధాన ఉద్దేశమని తుమ్మల తెలిపారు. ఇందులో 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని, వాటి ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన సాగు పద్ధతులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తామని చెప్పారు.రైతుల ఆదాయం పెరగాలంటే సాగు ఖర్చులు తగ్గించడంతో పాటు పండించిన పంటలకు మంచి ధర, విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. మార్కెట్ డిమాండ్‌ను గుర్తించి పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. వేరుశనగ, పెసలు, పొద్దుతిరుగుడు, మినుములు, శనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందని తెలిపారు.ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయ రంగానికి సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు ముందస్తు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో ఎకో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైతే రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి కూడా పెరుగుతుందని వివరించారు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, వ్యవసాయం బలోపేతమైతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని తుమ్మల అన్నారు. హకీంపేటలో జరిగే మెగా రైతు మేళాలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని తెలుసుకుని, తమ సాగులో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

గ్రామపంచాయతీల సొంత ఆదాయం ఇక నేరుగా ఖాతాల్లోకే!

- పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలక ముందడుగు: మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 06: తెలంగాణలో గ్రామపంచాయతీల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామపంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయాన్ని ఇకపై నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చట్ట సవరణ అమలుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నంబర్ 43ను శుక్రవారం విడుదల చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం--2026ను అక్టోబర్ 9, 2026 నుంచి అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గతంలో గ్రామపంచాయతీలు సమకూర్చుకున్న సొంత ఆదాయాన్ని ట్రెజరీ ద్వారా ఖర్చు చేయాల్సి వచ్చేది. దీంతో గ్రామాల్లో అత్యవసర అభివృద్ధి పనులకు నిధుల వినియోగంలో జాప్యం జరిగేది.తాజా నిర్ణయంతో గ్రామపంచాయతీలు తమ ఆదాయాన్ని స్థానిక అవసరాలకు అనుగుణంగా నేరుగా వినియోగించుకునే అవకాశం కలగనుంది. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగంగా చేపట్టేందుకు వీలవుతుంది.మంత్రి సీతక్క చొరవతో తీసుకొచ్చిన ఈ చట్ట సవరణ అమలుకు ఉత్తర్వులు వెలువడటంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. పల్లెల ఆర్థిక స్వావలంబనకు ఇది కీలక ముందడుగని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి స్థానిక పంచాయతీలే మరింత బాధ్యతతో నిర్ణయాలు తీసుకునేందుకు, గ్రామీణ స్థానిక సంస్థలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.
</

అక్రమ ఇసుక తవ్వకాలు, ఖనిజాల

రవాణాపై ఉక్కుపాదం

- అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ
- అధికారుల బాధ్యతలు ఖరారు చేసిన ప్రభుత్వం
- ఫిర్యాదు అందిన మూడు రోజుల్లో సంయుక్త తనిఖీలు
- ప్రతి 15 రోజులకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమీక్ష
- 30 రోజుల్లో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు



అమరావతి, నవంబర్ 06 : ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ ఇసుక తవ్వకాలు, ఖనిజాల అక్రమ తవ్వకాలు, అనధికార రవాణాకు అడ్డుకట్ట వేసేం దుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఈ అక్రమాలను నియంత్రించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు సమగ్ర మధ్యంతర మార్గదర్శకాలను జారీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఉత్తర్వులు వెలువరించారు.అక్టోబర్ 1న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నవంబర్ 3న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. గనులు, రెవెన్యూ, పోలీసు, అటవీ, జలవనరులు, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో చర్చించి అక్రమ తవ్వకాల నియంత్రణకు బాధ్యతలను ఖరారు చేశారు.గత రెండేళ్లలో ఇసుక అక్రమాలకు సంబంధించి 2,113 కేసులు నమోదు చేసి రూ.6.24 కోట్ల జరిమానా విధించారు. 117 వాహనాలను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చడంతో పాటు 21 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. చిన్న ఖనిజాల అక్రమాలకు సంబంధించి 2024-25 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు 9,120 కేసులు నమోదు చేసి రూ.340.9 కోట్ల జరిమానా విధించారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ, అటవీ, నదీ పరివాహక, జలవనరుల భూముల్లో ఆయా శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. అక్రమ తవ్వకాలు గుర్తించిన వెంటనే ఫిర్యాదు కోసం ఎదురుచూడకుండా చర్యలు ప్రారంభించాలి. పత్రికలు, టీవీలు, డిజిటల్ మీడియా, హెల్ప్‌లైన్, విజిలెన్స్ యాప్, ప్రజల వినతుల ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రత్యేక కేసు నంబరుతో నమోదు చేయాలి.ఫిర్యాదు అందిన మూడు పని దినాల్లో భూమి వివరాలు, యాజమాన్య హక్కులు, భౌగోళిక కోఆర్డినేట్లను సంబంధిత శాఖలు అందించాలి. గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి అదే గడువులో నివేదిక సమర్పించాలి.అక్రమ తవ్వకాలు నిర్ధారణ అయితే తవ్విన ఖనిజాల పరిమాణం, ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి జరిమానాలు విధించాలి. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అవసరమైతే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలి. నిందితులపై కేసులు నమోదు చేసి, చెల్లించని జరిమానాలను రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేయనున్నారు.అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్రమ తవ్వకాలు జరిగినట్లు తేలితే జిల్లా కలెక్టర్లు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. తనిఖీలకు వెళ్లే అధికారులకు పోలీసు రక్షణ కల్పించాలని, నేరాలు నిర్ధారణ అయినప్పుడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు.ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను క్రియాశీలం చేయనున్నారు. ఈ కమిటీ ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశమై కేసులు, చర్యలు, పెండింగ్ వ్యవహారాలను సమీక్షిస్తుంది. ప్రతి కేసుకు బాధ్యుడైన అధికారితో పాటు చర్యలు పూర్తి చేయాల్సిన గడువును కూడా నమోదు చేయాలి. ఫిర్యాదుల నమోదు నుంచి కేసుల పురోగతి వరకుఅన్ని వివరాలను పర్యవేక్షించేందుకు 30 రోజుల్లో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డును కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.వివిధ శాఖలు 15 రోజుల్లో తమ సూచనలు అందించాల్సి ఉండగా, నెలాఖరులో మరోసారి సమావేశమై సమగ్ర మార్గదర్శకాలను రూపొందించను న్నా రు. ప్రభుత్వ ఆదేశాలను అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు తప్పని సరిగా అమలుచేయాలనిప్రభుత్వంస్పష్టం చేసింది.

నేడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ

ఎన్నికల ఓట్ల లెక్కింపు

- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు
- 9,062 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు
- భద్రత కోసం 19,885 మంది పోలీసులతో మూడు అంచెల బందోబస్తు
- సీసీటీవీలు, డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలతో నిరంతర నిఘా

అమరావతి, నవంబర్ 06 : ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండో సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసింది. నవంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఇందుకోసం 9,062 లెక్కింపు బల్లలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు 11,002 మంది లెక్కింపు పర్యవేక్షకులు, 28,692 మంది లెక్కింపు సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించారు. ఎన్నికల్లో 77 జెడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 577 జెడ్పీటీసీ, 7,707 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 5న పోలింగ్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.72 శాతం పోలింగ్ నమోదైంది. 2021 ఎన్నికల్లో నమోదైన 60.91 శాతంతో పోలిస్తే ఈసారి 9.81 శాతం అధికంగా పోలింగ్ నమోదైనట్లు కమిషనర్ తెలిపారు. బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ బాక్సుల ధ్వంసం వంటి ఘటనల నేపథ్యంలో అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో నవంబర్ 6న రీపోలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం బ్యాలెట్ పెట్టెల్లోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తారు. మొత్తం కౌంటింగ్ బల్లల్లో 50 శాతం జెడ్పీటీసీ, మిగిలిన 50 శాతం ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు కేటాయించారు. ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను అందజేస్తారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి వెల్లడించారు. భద్రతా విధుల్లో



135 మంది డీఎస్పీలు, అదనపు ఎస్పీలు, 572 మంది ఇన్‌స్పెక్టర్లు, 1,412 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 14,877 మంది ఏఎస్ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు, 2,889 మంది హోంగార్డులు పాల్గొంటున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు సిబ్బందికి బాడీ వోర్న్ కెమెరాలను అందుబాటులో ఉంచారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఐజీ బి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

కొటియా ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించండి

- ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి వివాదానికి ముగింపు పలకాలి
- ఏపీ సీఎం చంద్రబాబుకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ

అమరావతి, నవంబర్ 06 :
పార్వతీపురం మన్యం జిల్లా కొటియా ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు శుక్రవారం లేఖ రాశారు. ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి కొటియా ప్రాంత ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కొటియా ప్రాంతంలోని 4 గ్రామ పంచాయతీల పరిధిలో 21 గ్రామాలు ఉండగా, సుమారు 4,835 మంది ప్రజలు నివసిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంపై ఒడిశా ప్రభుత్వం సుదీర్ఘకాలంగా తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తోందని, ఫలితంగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.1968లో ఒడిశా ప్రభుత్వం కొటియా ప్రాంతంపై దావాలు చేసిందని, 2006లో దావాలపై స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిందని వివరించారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించినప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ఒడిశా ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో కొటియా ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అక్కడి ప్రజలపై తన ప్రభావాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ ప్రాంత ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ఆశించిన స్థాయిలో చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కొటియా ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న సరిహద్దు వివాదం కారణంగా స్థానిక ప్రజలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం కనుగొనాలని, కొటియా ప్రాంత ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

చీరాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయంపై షర్మిల హర్షం

ఆమంచి కృష్ణమోహన్‌కు అభినందనలు తెలిపిన ఏపీసీసీ అధ్యక్షురాలు



అమరావతి, నవంబర్ 06 : చీరాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 44 స్థానాలకు గాను 42 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను బరిలో నిలిపి, 10 స్థానాల్లో విజయం సాధించడంతో పాటు, మిగిలిన స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు.కాంగ్రెస్ సారథ్యంలో చీరాలలో అభ్యర్థులు సాధించిన విజయం ఆమంచి కృష్ణమోహన్ కష్టానికి ప్రతిఫలమని పేర్కొన్నారు. స్థానిక ప్రజా సమస్యలపై ఆయన చేస్తున్న పోరాటానికి ఇది నిదర్శనమన్నారు.చీరాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం ప్రజాస్వామ్య విజయమని, రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయంగా నిలుస్తోందనడానికి ఇది సంకేతమని షర్మిల పేర్కొన్నారు.అధికార బలాన్ని, ప్రలోభాలను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచి విజయం సాధించిన వార్డు సభ్యులకు, ఎన్నికల్లో అహర్నిశలు శ్రమించిన పార్టీ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన చీరాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోలేకపోయినా, గౌరవప్రదమైన స్థానాలను దక్కించుకుని ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు సిద్ధమైన కాంగ్రెస్‌కు చీరాలలో నైతిక విజయం దక్కిందని ఆమె వ్యాఖ్యానించారు.గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకువస్తూ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని షర్మిల ఆకాంక్షించారు.

2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం : ఉత్తమ్








- కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోంది
- సంక్షేమ పథకాలతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం
- కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

హైదరాబాద్, నవంబర్ 06: తెలంగాణలో 2024లో ప్రారంభమైన కాంగ్రెస్ పాలన 2034 వరకు కొనసాగుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సూర్యాపేటలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల భారీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు పార్టీ సన్నద్ధతలో భాగంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సవోత్తమ్ రెడ్డి పోటీ చేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజల్లో ఆదరణ పెరగడానికి ప్రధాన కారణమని ఉత్తమ్ పేర్కొన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయడం ద్వారా ఆహార భద్రతతో పాటు పేదలకు గౌరవప్రదమైన జీవనం అందిస్తున్నామని చెప్పారు. నీటిపారుదల రంగంలో సవాళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టుపై నెలకొన్న ఆందోళనల మధ్య కూడా రాష్ట్రంలో గణనీయమైన వరి ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, రానున్న వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవడానికి, సాగునీటి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని వివరించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీకి కీలక అవకాశంగా అభివర్ణించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలు కె. రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తదితర నాయకులు ప్రసంగించారు.

బాలికలకు తుపాను అనంతర వైరల్ జ్వరాలా?

- 71 మందికి జ్వరాలు.. 30 మంది కోలుకున్నారు
- 38 మంది బాలికలకు వసతి గృహంలోనే వైద్య చికిత్స, పర్యవేక్షణ
- ముగ్గురు బాలికలు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలింపు
- ఒక బాలికకు ప్లాస్మోడియం ఫాల్సిపారం మలేరియా పాజిటివ్
- బాలికల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్య ఆరోగ్య శాఖ
- ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగింపు.. మంత్రి సత్యకుమార్ యాదవ్





అమరావతి, నవంబర్ 06 : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకుల పాఠశాలలో బాలికలకు జ్వరాలు వచ్చిన ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆర్. వెంకటరమణ సమర్పించిన నివేదిక ప్రకారం.. మొత్తం 71 మంది బాలికలు జ్వరాల బారినపడగా, వారిలో 30 మంది పూర్తిగా కోలుకున్నారు. ప్రస్తుతం 38 మంది బాలికలు వసతి గృహంలోని ప్రత్యేక గదిలో వైద్య చికిత్స, పర్యవేక్షణలో ఉన్నారు. మరో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలికలందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు వెల్లడించారు.

ఒకరికి మలేరియా పాజిటివ్

గురుకుల పాఠశాలలో మొత్తం 559 మంది బాలికలు ఉండగా, 516 మంది హాజరయ్యారు. వీరందరికీ ర్యాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్షలు నిర్వహించగా, ఒక బాలికకు ప్లాస్మోడియం ఫాల్సిపారం మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మిగిలిన 515 మందికి నెగెటివ్‌గా వచ్చింది. జ్వరాల బారినపడిన బాలికల్లో 44 మందికి నిర్వహించిన ఇతర జ్వర సంబంధిత పరీక్షల ఫలితాలు సాధారణంగా వచ్చాయి. మరింత సమగ్ర నిర్ధారణ కోసం రక్త నమూనాలను ప్రయోగశాలకు పంపించారు.

తుపాను అనంతర వైరల్ జ్వరాలుగా అనుమానం

నవంబర్ 6న జనరల్ మెడిసిన్, పిల్లల వైద్య నిపుణులతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుల క్లినికల్ పరిశీలన ప్రకారం.. బాలికలకు తుపాను అనంతరం వైరల్ జ్వరాలు వచ్చి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అవసరమైన చికిత్స అందిస్తూ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

నీటి నమూనాల పరీక్షలు

వసతి గృహంలోని మూడు వేర్వేరు నీటి వనరుల నుంచి నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ అధికారులు కూడా అదనపు నమూనాలను సేకరించారు. వసతి గృహంలో రెండు ఆర్ఓ ప్లాంట్లు ఉండగా, ఒకటి మరమ్మతులో ఉంది. ప్రస్తుతం బాలికలకు కాచి చల్లార్చిన నీటిని అందిస్తున్నారు. వంటశాల, వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.నీటిపరీక్షల్లోనూసాధారణ ఫలితాలు వచ్చినట్లు వెల్లడించారు.

ఇతర ప్రాంతాల్లో జ్వరాలు లేవు

వసతి గృహానికి కిలోమీటరు దూరంలో ఉన్న కురుపాం గ్రామంలో జ్వర కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాలికల ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉందన్నారు. జిల్లాలోని అన్ని గురుకుల, వసతి గృహ పాఠశాలల్లో జ్వరాలపై నిరంతర నిఘా ఉంచాలని, బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని క్షేత్రస్థాయి వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.బాలికలకు నిరంతర వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని కొనసాగిస్తూ, ప్రతి బాలిక ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆర్. వెంకటరమణ తెలిపారు.

యువతే దేశానికి దిక్సూచి..

ప్రతిభకు యువజనోత్సవాలు వేదిక..

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని భావి నాయకులుగా తీర్చిదిద్దేందుకు యువజనోత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు–2026 కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు, చిత్రలేఖనం, పాటలు, నృత్యం, ఇతర కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమలోని ప్రతిభను గుర్తించి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.కళలు, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని మానసిక వికాసంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, తమతమ రంగాల్లో గుర్తింపు సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో వివిధ రంగాలకు మార్గదర్శకులుగా ఎదిగి దేశానికి గర్వకారణంగా నిలవాలని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రాందాస్, కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ ప్రభాకర్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, జిల్లా ఉపాధి కల్పన అధికారి నిర్మల, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతరావు, యువజన పరిశ్రమల నోడల్ అధికారి దేవత ప్రభాకర్, ఉపాధ్యాయులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట ఎస్సైగా బాలరాజు బాధ్యతల స్వీకరణ

బలగం టీవీ, గంభీరావుపేట



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్సై బాలరాజు ప్రస్తుతం రామాయంపేటలో విధులు నిర్వహిస్తూ, అక్కడి నుంచి గంభీరావుపేటకు బదిలీపై వచ్చారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్సై బాలరాజుకు పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో తనకున్న అనుభవంతో గంభీరావుపేట పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా పోలీస్ శాఖను సంప్రదించి సహకారం పొందాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆకాంక్షిస్తున్నారు.

గుండారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలో తిమ్మాపూర్ సింగిల్ విండో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఫ్యాక్స్ వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం, గ్రామ సర్పంచ్ సరోజ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నందికిషన్ ముఖ్య అతిథులుగా పాల్గొని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా సింగిల్ విండో సహకార సంఘం వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు, దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, రైతులకు అందుబాటులో ఉంటూ కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి, వారికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఉందని పేర్కొన్నారు.

రైతులకు ధాన్యం విక్రయించే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, సహకార సంఘం నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, తిమ్మాపూర్ సింగిల్ విండో ప్రతినిధులు, గ్రామ రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బండలింగంపల్లిలో

ఉచిత చెస్ట్ ఎక్స్‌రే క్యాంపు

75 మంది హైరిస్క్ వ్యక్తులకు ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఏంజెలినా ఆల్ఫ్రెడ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో ఉచిత చెస్ట్ ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు. బండలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన) ఆధ్వర్యంలో గ్రామంలోని సెంటర్ వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో టీబీ వ్యాధి ముప్పు అధికంగా ఉన్న 75 మందికి ఉచితంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాదరాజు నరస గౌడ్, మండల వైద్యాధికారి డాక్టర్ సారియా, టీబీ సూపర్‌వైజర్లు మహిపాల్, పద్మ, ఎక్స్‌రే టెక్నీషియన్ బాలు, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ డిస్ట్రిక్ట్ లీడ్ నాగరాజు, ఏఎన్ఎంలు కమల, భారతి, సుమలత, ఆశా కార్యకర్తలు లావణ్య, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భవనాలకు రూ.88.50 కోట్లు మంజూరు చేయడం హర్షణీయం..

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:



రాష్ట్రంలోని 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేయడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పరశురాములు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం బీసీల సామాజిక అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ భవనాల ద్వారా బీసీ కుల సంఘాలకు శాశ్వత వేదికలు ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్తీక మాసంలోనే భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి, ఏడాదిలోగా నిర్మాణాలను పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యం అభినందనీయమన్నారు. మంజూరైన నిధులను సకాలంలో విడుదల చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు కేటాయించిన భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిపై వస్తున్న అపోహలు, దుష్ప్రచారాలను బీసీ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.ఆత్మగౌరవ భవనాలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా బీసీ విద్యార్థులకు విద్యా అవకాశాలు, పోటీ పరీక్షలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ మార్గదర్శకత్వం, వసతి సౌకర్యాలు, యువత అభివృద్ధి, సామాజిక చైతన్యానికి కేంద్రాలుగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

బీసీల ఆత్మగౌరవం కేవలం భవనాల నిర్మాణంతోనే పరిపూర్ణం కాదు. విద్య, ఉపాధి, నైపుణ్యం, సామాజిక న్యాయం, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభ్యున్నతి సాధ్యమవుతుంది అని మ్యాకల పరశురాములు అభిప్రాయపడ్డారు. బీసీల ఆత్మగౌరవం, అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

దీపావళి వేడుకల్లో అప్రమత్తతే అసలైన భద్రత

- బాణసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా 108 అత్యవసర సేవల ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్

బలగం టీవీ, కరీంనగర్:

ఆనందంగా... సురక్షితంగా... దీపావళి పండుగను జరుపుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా 108 అత్యవసర సేవల ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. దీపావళి పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ EMRI గ్రీన్ హెల్త్ సర్వీసెస్ (EMRI GHS) – 108 అత్యవసర సేవల తరఫున ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ అయినప్పటికీ, బాణసంచా కాల్చే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా అగ్నిప్రమాదాలు, కాలిన గాయాలు, కంటి గాయాలు వంటి ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

2025 సంవత్సరానికి సంబంధించి గతంలో వెల్లడించిన గణాంకాల ప్రకారం సాధారణ రోజుల్లో అగ్నిప్రమాదాల కారణంగా 1,766 మంది గాయపడగా, దీపావళి రోజున బాణసంచా ప్రమాదాల వల్ల 1,699 మంది ప్రమాదాలకు గురైనట్లు పేర్కొన్నారు. ఈ గణాంకాలు పండుగ సమయంలో భద్రతా చర్యల ఆవశ్యకతను తెలియజేస్తున్నాయని తెలిపారు.



బాణసంచాను ఇళ్లలో కాకుండా విశాలమైన బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలి. ఇళ్లు, వాహనాలు, మండే వస్తువులకు దూరంగా ఉండాలి. అధిక శబ్దం వచ్చే టపాసులను నివారించాలి. సులభంగా మండే సింథటిక్ దుస్తులకు బదులుగా కాటన్ దుస్తులు ధరించాలి. తప్పనిసరిగా పాదరక్షలు ధరించాలి. చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే బాణసంచా కాల్చాలి. అవసరమైతే కళ్ల రక్షణ కోసం గాగుల్స్ ఉపయోగించాలి. టపాసులను చేతిలో పట్టుకుని కాల్చకూడదు. పేలని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదు. ముందస్తు జాగ్రత్తగా నీరు లేదా ఇసుక బకెట్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.

అగ్నిప్రమాదం లేదా కాలిన గాయాలు సంభవించిన వెంటనే 108 అత్యవసర సేవలకు ఫోన్ చేయాలి. కాలిన ప్రాంతంపై ఐస్ పెట్టకుండా సాధారణ చల్లటి ప్రవహించే నీటితో 20 నిమిషాల పాటు చల్లబరచాలి. గాయపడిన ప్రాంతాన్ని శుభ్రమైన, మెత్తటి వస్త్రంతో లేదా స్టెరైల్ డ్రెస్సింగ్‌తో వదులుగా కప్పాలి. కాలిన గాయాలపై కొబ్బరి నూనె, టూత్‌పేస్ట్, ఇంకు వంటి గృహ సంబంధిత పదార్థాలను పూయకూడదు. ఏర్పడిన బొబ్బలను పగలగొట్టకూడదు. చర్మానికి అంటుకున్న దుస్తులను బలవంతంగా తొలగించకూడదు. వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలి.

EMRI GHS స్టేట్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ బి. సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచుతూ 108 అత్యవసర సేవలు 24 గంటల పాటు ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు, కాలిన గాయాలు, కంటి గాయాలు లేదా ఇతర అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 108కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

చివరిగా భూమా నాగేందర్ మాట్లాడుతూ, మనం తీసుకునే చిన్నపాటి జాగ్రత్త మరొకరి ప్రాణాన్ని కాపాడగలదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రమాదరహిత వాతావరణంలో మన భద్రత మన బాధ్యత... ఆనందంగా, ఆరోగ్యంగా, సురక్షితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని కోరారు.



విశ్వ బ్రాహ్మణ ఐక్య సంఘం అధ్యక్షుడిగా

ఎన్నికైన ఆంజనేయులు చారికి ఘన సన్మానం..

- శాలువాతో సత్కరించిన ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బుగ్గ కృష్ణమూర్తి శర్మ.

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

విశ్వ బ్రాహ్మణ ఐక్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కొత్తపల్లి ఆంజనేయులు చారిని ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు చారికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

విశ్వ బ్రాహ్మణ ఐక్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సంఘం అభివృద్ధికి, విశ్వ బ్రాహ్మణుల ఐక్యతకు ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘ సభ్యుల సంక్షేమం, సామాజిక ఐక్యత, కుల వృత్తుల పరిరక్షణకు తన నాయకత్వంలో మరింత కృషి చేయాలని బుగ్గ కృష్ణమూర్తి శర్మ సూచించారు.

ఈ సందర్భంగా ఆంజనేయులు చారి తనకు అభినందనలు తెలిపి సన్మానించిన బుగ్గ కృష్ణమూర్తి శర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో శ్మశానానికి...

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాలతో ఐసీయూలో చికిత్స..!

- నిరుపేదలకు అండగా ఆది శ్రీనివాస్..

శ్మశానవాటికలో ఉన్న బాధితుడికి ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం..

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పూర్తి సహకారం అందిస్తామని భరోసా..

బలగం టీవీ, వేములవాడ:

వేములవాడ పట్టణంలోని శ్మశానవాటికలో అనారోగ్యంతో బాధపడుతూ, తన కుమారుడితో కలిసి ఆశ్రయం పొందుతున్న తల్లి దీనస్థితిపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించారు. చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన అమృత గత ఐదేళ్లుగా వేములవాడలో నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు మరిపల్లి రాకేష్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, నివాసం ఉంటున్న అద్దె ఇంటిని ఖాళీ చేయించడంతో దిక్కుతోచని స్థితిలో కుమారుడిని కాపాడుకోవాలనే ఆవేదనతో శ్మశానవాటికలో తలదాచుకుంది.

ఈ హృదయవిదారక ఘటనపై స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని మున్సిపల్ పాలకవర్గం, అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌తో కలిసి బాధితుడు రాకేష్‌ను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. మరిపల్లి రాకేష్ గత కొన్నేళ్లుగా వేములవాడలో నివాసం ఉంటున్నాడని, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో అద్దె ఇంటిని ఖాళీ చేయించడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని తెలిపారు. తన కుమారుడిని కాపాడుకోవడానికి తల్లి అమృత పడుతున్న వేదనను గుర్తించి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విషయం తెలియజేయగానే ఆయన వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన వైద్య సహాయం అందించాలని ఆదేశించారని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే సూచనల మేరకు రాకేష్‌ను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి, వైద్యులతో మాట్లాడి ఐసీయూలో చేర్పించినట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు కూడా తక్షణమే స్పందించి రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి మెరుగైన వైద్య చికిత్స ప్రారంభించారని వెల్లడించారు.ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం తరఫున బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కొండా రాజశేఖర్, నాయకులు మూడపెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ స్కాలర్ మృతి.. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు

ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో తీవ్రగాయాలు..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

వరంగల్ NIFలో పీహెచ్‌డీ స్కాలర్‌గా చదువుతూ, సివిల్స్‌కు సిద్ధమవుతున్న తేజస్విని (32)


విషాదంలోనూ ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచిన తల్లిదండ్రులు

బలగం టీవీ,చిగురుమామిడి,

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల పరిధిలోని రేకొండ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ దుద్దెల శ్రీనివాస్ కుమార్తె, పీహెచ్‌డీ స్కాలర్ దుద్దేల తేజస్విని (32) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున అకాల మరణం చెందారు.

తేజస్విని తన సోదరితో కలిసి ద్విచక్ర వాహనంపై కొత్తపల్లి నుంచి కరీంనగర్‌కు వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ఒక కారు వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడటంతో వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె కన్నుమూశారు.

ఉన్నత లక్ష్యాలు నెరవేరకుండానే అనంత లోకాలకు:



వరంగల్‌లోని ఎన్ఐఎఫ్ (NIF)లో పీహెచ్‌డీ స్కాలర్‌గా చదువుకుంటున్న తేజస్విని, మరోవైపు దేశంలోనే అత్యున్నతమైన 'సివిల్ సర్వీసెస్' సాధించాలనే దృఢ సంకల్పంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. భవిష్యత్తుపై ఎన్నో ఉన్నత ఆశలతో చదువులో రాణిస్తున్న ఆమె ఇలా అకస్మాత్తుగా మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులు మరియు రేకొండ గ్రామస్తులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

విషాదంలోనూ నేత్రదానంతో ఆదర్శం:

కూతురు మరణించిన పుట్టెడు దుఃఖంలోనూ తేజస్విని కుటుంబ సభ్యులు సమాజానికి ఆదర్శంగా నిలిచే గొప్ప నిర్ణయం తీసుకున్నారు. ఆమె నేత్రాలను హైదరాబాద్‌లోని 'ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్' (LV Prasad Eye Institute)కు దానం చేశారు. తేజస్విని భౌతికంగా మన మధ్య లేకపోయినా, నేత్రదానం ద్వారా మరొక ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపి సజీవంగా నిలిచిపోనుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖుల సంతాపం:

తేజస్విని అకాల మృతి పట్ల సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పొడితల సతీష్ కుమార్, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సతీష్, సీఐ బిల్ల కోటేశ్వర్, ఎస్సైలు మామిడాల సురేందర్, చందవేని శ్రీనివాస్, సర్పంచ్ అల్లెపు సంపత్, మాజీ సర్పంచ్ పిట్టల రజిత, సీపీఐ జిల్లా నాయకులు చాడ శ్రీధర్ రెడ్డి, బోయిని అశోక్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.



సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదు

సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

పెండింగ్ డిమాండ్లపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు

కార్మికుల న్యాయమైన సమస్యలను కలెక్టర్ తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్

ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు జనగాం రాజమల్లు, పాలడుగు సుధాకర్

బలగం టీవీ, సిరిసిల్ల,

సిరిసిల్ల మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించేలా జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (CITU) నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పూర్తిస్థాయిలో నెరవేరే వరకు తమ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలసి తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

సంవత్సరాలుగా పెండింగ్‌లో సమస్యలు:

ఈ ధర్నా కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలడుగు సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ కార్మికులకు సంబంధించిన పలు సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోకపోవడం వల్లే కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమ్మె విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు కార్మికులందరూ ఐక్యంగా పోరాటాన్ని కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చి డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షురాలు సూరం పద్మ, కోశాధికారి అన్నలాస్ గణేష్, సిరిసిల్ల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాసారపు శంకర్, నాయకులు బాబా కిషన్, దేవరాజు, అర్జున్, అరుణ్, విజయ, ఉమ, లక్ష్మి, ఏసవ్వ, భారతి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలకు కాలం చెల్లిందా..?

- స్కూటీల హామీ గాలికి.. నిరుద్యోగ భృతి నీటిమూట!

- ఓట్ల కోసం హామీలు.. గెలిచాక మౌనం..!

- వెయ్యి రోజులు గడిచినా అమలుకాని కాంగ్రెస్ ఎన్నికల హామీలు..

-బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ధ్వజం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దురదృష్టకరమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ విమర్శించారు.

సిరిసిల పట్టణ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు స్కూటీ అందిస్తామని గొప్పగా ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించారని రవి గౌడ్ ఆరోపించారు. ఆడబిడ్డల భవిష్యత్తు, మహిళా సాధికారత గురించి మాట్లాడిన కాంగ్రెస్ నేతలు.. స్కూటీల హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

అదేవిధంగా నిరుద్యోగ యువతకు నెలవారీ నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చకపోవడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.



18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారు? నిరుద్యోగ యువతకు భృతి ఇంకెప్పుడు అందిస్తారు? ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసమేనా? అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన మాటను మరిచిపోవడమేనా? అంటూ కంచర్ల రవి గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఎన్నికల ముందు యువత, విద్యార్థులు, మహిళల సంక్షేమమే లక్ష్యమని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక వారి సమస్యలను పట్టించుకోకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతులకు స్కూటీలు, అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందించే హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు బీఆర్ఎస్వీ తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కంచర్ల రవి గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, ఆరేళ్ల వినయ్, బైకని వేణు, మార్గం కార్తికేయ, పటేల్ నవీన్, వినయ్, కాంబోజి వర్షిత్, స్వాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట మండల విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షులుగా కొత్తపల్లి అంజయ్య

- మండల అధ్యక్ష పదవికి రసవత్తరంగా ఎన్నికలు..

- 11 ఓట్ల మెజార్టీతో గెలుపు..

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండల విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్ష పదవికి బండ లింగంపల్లి గ్రామానికి చెందిన కొత్తపెల్లి అంజయ్య (ఉంగరం గుర్తు) అల్మాస్పూర్ గ్రామానికి చెందిన మొగులోజీ కిష్టయ్య (కత్తెర గుర్తు)పై పోటీపడ్డారు. ఇరువురి మధ్య హోరాహోరీగా పంచాయతీ ఎన్నికలను తలపించే విధంగా విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘానికి ఎన్నికలు జరిగాయి.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్బులో ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. మండల అడక్ కమిటీ సభ్యులు వంగల వసంతం, నల్ల నాగుల రామాచారి, దుంపేటి కృష్ణమూర్తి, కోడుమోజీ దేవేందర్ ల పర్యవేక్షణలో ఓటర్ లిస్టు ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. ఎల్లారెడ్డిపేట మండలంలో మొత్తము విశ్వబ్రాహ్మణ మనుమయ సంక్షేమ సంఘంలో 550 మంది ఓటర్లు గా నమోదయ్యారు. కాగా 291మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొత్తపల్లి అంజయ్యకు 151 ఓట్లు, కిష్టయ్యకు 140 ఓట్లు వచ్చాయి.. 11 ఓట్ల మెజార్టీతో అంజయ్య గెలుపొందినట్లు ప్రకటించారు. తనను ఎంతో విశ్వాసంతో అధ్యక్షునిగా గెలిపించిన విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ సభ్యులకు అందుబాటులో ఉండి అందరి సంక్షేమ కోసం పనిచేస్తానని అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా వంగల వసంతం జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్ లు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారిన విశ్వబ్రాహ్మణ మనుమయల బతుకులు మారడం లేదని అధికారంలో ఉన్న ప్రభుత్వం విశ్వా బ్రాహ్మణ మనుమయ సంక్షేమం గురించి పట్టించుకోవాలని ఆయన కోరారు. పనిముట్లను ఉచితంగా అందజేసి ప్రభుత్వం సబ్సిడీ వడ్డీ లేని రుణాలను ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో మండలంలోని విశ్వబ్రాహ్మణ మనుమయ సంక్షేమ సంఘానికి చెందిన సభ్యులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలను దాచుకోవద్దు..

కౌన్సెలింగ్‌తో పరిష్కారం పొందండి..



-ప్రముఖ మానసిక నిపుణుడు కనుకుంట్ల పున్నంచందర్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన కౌన్సెలింగ్, చికిత్స తీసుకోవాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని ప్రముఖ మానసిక నిపుణుడు కనుకుంట్ల పున్నంచందర్ అన్నారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని పద్మశాలి సంఘం భవనంలో మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్, ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో మనోవికాస సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పున్నంచందర్ మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నివారణ, వ్యసనాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ప్రముఖ మానసిక నిపుణుడు కనుకుంట్ల పున్నంచందర్ మాట్లాడుతూ.. పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యల కారణంగా మానసిక ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు. సమస్యలను మనసులోనే దాచుకోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవాలని, అవసరమైనప్పుడు నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

మద్యపాన వ్యసనం వ్యక్తి ఆరోగ్యంపైనే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులు, సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు మద్యపానాన్ని ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, వ్యసనానికి గురైన వారు నిపుణుల సహాయంతో చికిత్స పొందాలని సూచించారు. ఆత్మహత్య ఆలోచనలు కలిగిన వారిని ఒంటరిగా వదిలేయకుండా వారితో మాట్లాడి ధైర్యం చెప్పాలని, వెంటనే నిపుణుల సహాయం అందించాలని కోరారు.

కమ్యూనిటీ ఫెసిలిటేటర్ వేముల మార్కండేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ త్రిఫ్ట్, నేతన్న భీమా పథకాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం రచన మధుకర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బల్ల లక్ష్మీపతి, కార్యదర్శి మాదాసు సత్యనారాయణ, గౌడ రాజమహేందర్, మాసం రాజేందర్, భోగ రంగయ్య, జెల్ల సదానందం, కొండి సంపత్, చింతకింది శ్రీకాంత్, ఆకేన శ్రీనివాస్, వేముల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణమే అసలైన పుట్టినరోజు వేడుక..

- అనాథ వృద్ధుల మధ్య ఘనంగా మజీద్ జన్మదిన వేడుకలు..!

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

పుట్టినరోజు అంటే కేవలం కేకులు కట్ చేయడం, విందులు చేసుకోవడం మాత్రమే కాదు.. తోటివారికి సాయపడటంలో, ఆపన్నుల ముఖంలో చిరునవ్వులు చూడటంలోనే అసలైన సంతృప్తి ఉంటుందని నిరూపించారు తెలంగాణ రక్షణ సేన సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ మజీద్.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా అనాథ వృద్ధాశ్రమం'లో తెలంగాణ రక్షణ సేన సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ పుట్టినరోజు వేడుకలను అత్యంత నిరాడంబరంగా, అదే సమయంలో సేవాభావంతో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక రోజును కేవలం కుటుంబ సభ్యులకే పరిమితం చేయకుండా, అనాథ వృద్ధుల మధ్య జరుపుకోవాలని ఆయన సంకల్పించారు.

ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులందరికీ ఘనంగా మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. అనంతరం వారికి స్వయంగా పండ్లు మరియు ఫలహారాలు పంపిణీ చేశారు. తమ పుట్టినరోజు నాడు తమను గుర్తుపెట్టుకుని ఆప్యాయంగా పలకరించిన మజీద్ ని వృద్ధులు మనసారా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి మజీద్ మాట్లాడుతూ.. వారి మోహములో కనిపించిన ఆనందం ఈ వేడుకను మరింత సార్థకం చేసిందని, సమాజంలో ఎవరికైతే ఆదరణ కరువవుతుందో, అలాంటి వారి మధ్య నా పుట్టినరోజు జరుపుకోవడం తబకు ఎంతో మనశ్శాంతినిచ్చిందని, నాయకుడైనా, సాధారణ వ్యక్తయినా తోటి మనుషులకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని రాబోయే రోజుల్లోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు అల్లే శంకర్, నియోజకవర్గ మహిళ నాయకురాలు కదిరే రేణుక, నియోజకవర్గ యువనాయకుడు సయ్యద్ జావిద్, యువ నాయకుడు బందెల్ల రాజు ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు కదిరే భాస్కర్ గౌడ్, ఎల్లారెడ్డిపేట మండలం ఉపాధ్యక్షులు బొమ్మనేని పరశురాములు, ప్రధాన కార్యదర్శి కొడుముంజ బాబు, ఎల్లారెడ్డిపేట మండల మహిళా అధ్యక్షురాలు కుల్లేరి మౌనిక, మండల మహిళా ఉపాధ్యక్షురాలు ఆకారం పుష్పలత, రాజన్న సిరిసిల్ల జిల్లా ముఖ్యనాయకులు తోక దేవదాసు, దేవునూరి కవిత, సల్మాల





160 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ..

– దాతల సహకారం అభినందనీయం: మండల విద్యాధికారి దూస రఘుపతి

బలగం టీవీ, సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని ఎంపీపీఎస్ తారకరామా నగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం రోజు 160 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కళ్యాడపు సుభాష్, మండల సత్యం, మంచె మల్లయ్య, బండారి అశోక్, బూట్ల సతీష్‌లు దాతలుగా వ్యవహరించి పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి దూస రఘుపతి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు స్థానిక నాయకులు, దాతల సహకారం ఎంతో అవసరమని అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం సమష్టిగా కృషి చేస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ గంగరాజు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోతిలాల్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బైరి సంధ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐరేని భారతి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించిన దాతలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన దాతల సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, జ్యోతి, నాగలక్ష్మి, శారద, స్థానికులు పిసుక శ్రీనివాస్, గడ్డం వెంకటేశం, జక్కని దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



రంజీ ట్రోఫీలో హైదరాబాద్ సంచలన విజయం

ఒక్క వికెట్ తేడాతో ఛత్తీస్‌గఢ్‌పై గెలుపు!

రోమాంచక పోరులో ఆఖరి వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యంతో గెలిపించిన అనికేత్ రెడ్డి, రక్షన్ రెడ్డి

నాలుగు మ్యాచ్‌లలో మూడో విజయంతో ఎలైట్ గ్రూప్-బీ అగ్రస్థానంలో నిలిచిన హైదరాబాద్

9 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరువైన చామ మిలింద్ సేన

బలగం టీవీ, క్రీడా విభాగం:

రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో హైదరాబాద్ క్రికెట్ జట్టు తమ అజేయ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. జింఖానా మైదానం వేదికగా ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన ఎలైట్ గ్రూప్-బీ లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఒక్క వికెట్ తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది.

ఆఖరి వికెట్ డ్రామా - అనికేత్, రక్షన్ సాహసోపేత బ్యాటింగ్:

259 పరుగుల విజయలక్ష్యంతో ద్వితీయ ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఒక దశలో 220 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి తీవ్ర ఓటమి ముంగిట నిలిచింది. అయితే, ఆఖరి వికెట్‌కు బౌలర్లు గంగం అనికేత్ రెడ్డి (56 బంతుల్లో 39 నాటౌట్), రక్షన్ రెడ్డి (66 బంతుల్లో 15 నాటౌట్) అత్యంత క్రమశిక్షణతో బ్యాటింగ్ చేసి అజేయంగా 39 పరుగులు జోడించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఓపెనర్ అభిరత్ రెడ్డి (68), వరుణ్ గౌడ్ (55) అర్ధశతకాలతో రాణించారు.

పాంట్ బై పాయింట్ మ్యాచ్ స్కోరు వివరాలు:

ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్: 284/10

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: 280/10 (రాహుల్ రాదేష్ 72, హిమతేజ 46)

ఛత్తీస్‌గఢ్ ద్వితీయ ఇన్నింగ్స్: 254/10

హైదరాబాద్ ద్వితీయ ఇన్నింగ్స్: 259/9 (అభిరత్ రెడ్డి 68, వరుణ్ గౌడ్ 55, అనికేత్ రెడ్డి 39*)

క్వార్టర్స్‌కు ముంగిట హైదరాబాద్:

ఈ విజయంతో మొత్తం 4 మ్యాచ్‌లలో 3 విజయాలు, ఒక డ్రాతో 20 పాయింట్లు సాధించి గ్రూప్-బీలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. తదుపరి టోర్నీలో అస్సాం, కర్ణాటక, సౌరాష్ట్రలతో జరగనున్న మూడు మ్యాచ్‌లలో రెండింటిలో విజయం సాధిస్తే హైదరాబాద్ 2016-17 సీజన్ తర్వాత మళ్లీ రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తుంది. 1986-87లో చివరిసారిగా రంజీ టైటిల్ నెగ్గిన హైదరాబాద్, సుదీర్ఘకాల నిరీక్షణకు ఈసారి తెరదించాలని పట్టుదలతో ఉంది.



బీహార్ కెప్టెన్‌గా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ!

సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీకి 17 మంది సభ్యులతో కూడిన బీహార్ సీనియర్ జట్టు

సారథిగా బాధ్యతలు చేపట్టిన టీనేజ్ స్టార్

వైస్ కెప్టెన్‌గా సూరజ్ కశ్యప్ నియామకం.. నవంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న టోర్నీ

బలగం టీవీ, క్రీడా విభాగం:

నవంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక 'సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ' టీ20 టోర్నీ కోసం బీహార్ క్రికెట్ అసోసియేషన్ (BCA) తమ సీనియర్ జట్టును ప్రకటించింది. తొలి రెండు మ్యాచ్‌లకు 17 మంది సభ్యులతో కూడిన బీహార్ జట్టు కెప్టెన్‌గా టీనేజ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎంపికయ్యాడు. బీహార్ సీనియర్ జట్టుకు అతడు సారథ్యం వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. సూరజ్ కశ్యప్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు.

టోర్నీలో బీహార్ జట్టు గ్రూప్-బిలో ఢిల్లీ, హర్యానా, జమ్మూ అండ్ కాశ్మీర్, పంజాబ్, రైల్వేస్, సౌరాష్ట్ర, తమిళనాడు జట్లతో పోటీపడనుంది. నవంబర్ 14న ఇండోర్ వేదికగా సౌరాష్ట్రతో బీహార్ తన మొదటి మ్యాచ్ ఆడనుంది.

సూర్యవంశీ అద్భుత ఫామ్:

చిన్న వయస్సులోనే అత్యద్భుతమైన ప్రతిభ, ఆత్మవిశ్వాసాన్ని కనబరుస్తున్న సూర్యవంశీకి ఈ కెప్టెన్సీ మంచి నాయకుడిగా ఎదిగే అవకాశం కలిగిస్తుందని బీసీఏ అధ్యక్షుడు హర్ష్ వర్ధన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐపీఎల్ (IPL) లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న ఈ ఎడమచేతి వాటం బ్యాటర్, ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో 16 ఇన్నింగ్స్‌లలో 237కి పైగా తీవ్రమైన స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతేకాకుండా, అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లాండ్‌పై కేవలం 80 బంతుల్లో 175 పరుగులు చేసి భారత్‌కు ప్రపంచకప్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. భారత సీనియర్ టీ20 జట్టు తరఫున ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన అతడు, ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో 19 బంతుల్లోనే 45 పరుగులు చేసి మెరిసాడు.

బీహార్ జట్టు వివరాలు:

వైభవ్ సూర్యవంశీ (కెప్టెన్), ఆలోక్ కుమార్, ఆయుష్ లోహరుక (వికెట్ కీపర్), అల్తమష్ అష్రఫ్, పరమ్ కుమార్ సింగ్, అన్మోల్ కుమార్ (వికెట్ కీపర్), రిత్విక్ రాజ్, సూరజ్ కశ్యప్ (వైస్ కెప్టెన్), మయాంక్ కుమార్, రాఘవేంద్ర ప్రతాప్, ఆశిష్ కుమార్, వాసుదేవ్ ప్రతాప్ సింగ్, మహమ్మద్ ఇజార్, ఆమోద్ యాదవ్, ప్రశాంత్ సింగ్, నవాజ్ ఖాన్, హిమాంశు సింగ్.

న్యూజిలాండ్ ఫైండ్లీస్‌కు భారత ఫుట్‌బాల్ జట్టు ప్రకటన

గుర్‌ప్రీత్ సింగ్ సంధుపై వేటు!

హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో డిఫెండర్ అన్వర్ అలీ, లాలెంగ్‌మావియా రాల్టే దూరం

న్యూజిలాండ్‌తో నవంబర్ 12, 15 తేదీలలో

రెండు అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లు

బలగం టీవీ, క్రీడా విభాగం:

న్యూజిలాండ్‌తో త్వరలో జరగనున్న అంతర్జాతీయ స్నేహపూర్వక (International Friendlies) మ్యాచ్‌ల కోసం భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్ 23 మంది సభ్యులతో కూడిన సీనియర్ జట్టును ప్రకటించారు. గత మ్యాచ్‌లలో పేలవ ప్రదర్శన కారణంగా సీనియర్ గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ గుర్‌ప్రీత్ సింగ్ సంధును జట్టు నుంచి పక్కన పెట్టడం గమనార్హం. బ్రెజిల్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 0-4తో ఘోరంగా ఓడిపోవడమే గుర్‌ప్రీత్‌పై వేటు పడటానికి కారణమని తెలుస్తోంది.

మరోవైపు, ఈస్ట్ బెంగాల్ డిఫెండర్ అన్వర్ అలీ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో (Grade 1) జట్టుకు దూరమయ్యాడు. అతడు కోలుకోవడానికి నెలకు పైగా సమయం పడుతుందని వైద్య వర్గాలు తెలిపాయి. లాలెంగ్‌మావియా రాల్టే (అపుయా), మహమ్మద్ సనాన్‌లు కూడా గాయాల కారణంగా వైదొలిగారు.

నవంబర్ 12, 15 తేదీలలో మ్యాచ్‌లు:'బ్లూ టైగర్స్'గా పిలిచే భారత జట్టు న్యూజిలాండ్‌తో రెండు మ్యాచ్‌లు ఆడనుంది:

మొదటి మ్యాచ్: నవంబర్ 12న ఆక్లాండ్‌లోని గో మీడియా స్టేడియంలో (భారత కాలమానం ప్రకారం ఉదయం 11.30 గంటలకు)

రెండో మ్యాచ్: నవంబర్ 15న క్రైస్ట్‌చర్చ్‌లోని వన్ న్యూజిలాండ్ స్టేడియంలో (ఉదయం 8.30 గంటలకు).

ఢాకాలో సాఫ్ (SAFF) ఛాంపియన్‌షిప్ ఆడుతున్న బిజోయ్ వర్గీస్, ముహమ్మద్ సుహైల్, లిస్టన్ కొలాకోలు అక్కడి నుంచి నేరుగా న్యూజిలాండ్ టూర్ జట్టులో చేరనున్నారు. కాగా, జట్టు సభ్యులు శనివారం బెంగళూరులో సమావేశమై శిక్షణ పొందిన అనంతరం ఆదివారం రాత్రి ఆక్లాండ్‌కు బయలుదేరతారు.

భారత పూర్తి జట్టు వివరాలు:

గోల్‌కీపర్లు

హృతిక్ తివారి, సోమ్ కుమార్, విశాల్ కైత్

డిఫెండర్లు

అభిషేక్ సింగ్ టెక్చామ్, ఆకాష్ మిశ్రా, బిజోయ్ వర్గీస్, జై గుప్తా, మెహతాబ్ సింగ్, ప్రమ్‌వీర్, రిక్కీ మీతేయ్ హాబామ్, రోషన్ సింగ్ నవోరెమ్

మిడ్‌ఫీల్డర్లు

అనిరుధ్ థాపా, ఆషిక్ కురునియన్, జిథిన్ MS, లాల్రెమ్‌త్లుఅంగా ఫనాయ్, లాల్రిన్లియానా హ్నమ్టే, తొంబా సింగ్ హాబామ్

ఫార్వర్డ్లు

డేవిడ్ లాల్హ్లాన్సంగా, ఎడ్మండ్ లాల్రిండికా, లిస్టన్ కొలాకో, మన్వీర్ సింగ్, ముహమ్మద్ సుహైల్, ర్యాన్ విలియమ్స్

రెండో వన్డేకు వర్షం ముప్పు..

వెల్లింగ్టన్‌లో నేడు భారత్-న్యూజిలాండ్ మ్యాచ్

వన్డేపై కమ్ముకున్న వర్షపు మేఘాలు

రద్దయిన భారత జట్టు ప్రాక్టీస్ సెషన్

వాతావరణ శాఖ అంచనా ప్రకారం 60 శాతం మేర వర్షం పడే ఛాన్స్..

ఉదయం నుంచి రాత్రి వరకు వాతావరణం మేఘావృతమై, ఈదురుగాలులు వీచే అవకాశం

బలగం టీవీ, క్రీడా విభాగం:

న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను ఘనంగా ప్రారంభించిన రోహిత్ సేన, శనివారం (నవంబర్ 07) వెల్లింగ్టన్ వేదికగా జరగనున్న రెండో వన్డేలోనూ అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. అయితే ఈ మ్యాచ్‌కు వరుణుడి నుంచి తీవ్ర ముప్పు పొంచి ఉంది. తొలి వన్డేలోనూ అప్పుడప్పుడు వర్షం అంతరాయం కలిగించగా, ఇప్పుడు రెండో మ్యాచ్‌కు వెల్లింగ్టన్ వెదర్ పూర్తిగా నిరాశపరిచేలా కనిపిస్తోంది.

రద్దు అయిన భారత జట్టు ప్రాక్టీస్:

సాధారణంగా వెల్లింగ్టన్‌లో తరచూ చల్లటి గాలులు వీస్తుంటాయి, వర్షాలు కురుస్తుంటాయి. శుక్రవారం ఉదయం స్థానికంగా అవే పరిస్థితులు కనిపించాయి. ఉదయం పొగమంచుతో కూడిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడి, కాసేపటికే వర్షం కురిసింది. మ్యాచ్ జరగాల్సిన ప్రధాన స్టేడియంలో కాకుండా సమీపంలోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరగాల్సిన ఇరు జట్ల ప్రాక్టీస్ సెషన్‌కు ఈ వర్షం అడ్డంకిగా మారింది. న్యూజిలాండ్ జట్టు తమ ప్రాక్టీస్‌ను వేరే చోటుకి మార్చుకోగా, భారత జట్టు మాత్రం వర్షం కారణంగా తమ శిక్షణ సెషన్‌ను పూర్తిగా రద్దు చేసుకోవాల్సి వచ్చింది.



వర్షం పడే అవకాశాలు 60 శాతం:

అక్యువెదర్ (AccuWeather) నివేదికల ప్రకారం.. శనివారం వెల్లింగ్టన్‌లో వర్షం కురిసే అవకాశం దాదాపు 60 శాతం వరకు ఉంది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉండి, చల్లటి గాలులు వీయనున్నాయి.

భారత కాలమానం ప్రకారం ఉదయం 7:30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:00 గంటలకు) మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉంది.

మ్యాచ్ ప్రారంభ సమయానికి కూడా వర్షం పడే సూచనలు బలంగా ఉండటంతో టాస్ మరియు మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లోనూ 50 నుంచి 55 శాతం మేర వర్షం పడే ఛాన్స్ ఉందని వెదర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

ముఖ్యంగా రాత్రి 8 నుండి 11 గంటల మధ్య వర్షం ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో, మ్యాచ్ పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

మొత్తానికి, తొలి వన్డే విజయంతో ఊపుమీదున్న టీమిండియా జోరుకు వెల్లింగ్టన్ వాతావరణం బ్రేకులు వేస్తుందా లేదా అనేది మ్యాచ్ రోజు పరిస్థితులపై ఆధారపడి ఉంది.

అండర్-19 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం



నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘనవిజయం!

విధ్వంసకర అర్ధశతకంతో మెరిసిన ఆర్యవీర్ సెహ్వాగ్ (70 నాటౌట్)

భారత బౌలర్ల ధాటికి 128 పరుగులకే కుప్పకూలిన నేపాల్ అండర్-19 జట్టు

ఆదివారం జరగనున్న తదుపరి పోరులో పాకిస్థాన్‌తో తలపడనున్న భారత్

బలగం టీవీ, క్రీడా విభాగం:

అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నీలో భారత యువ జట్టు బోణీ కొట్టింది. శుక్రవారం నేపాల్ అండర్-19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సర్వాంగీణ ప్రతిభ కనబరిచిన టీమిండియా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (52 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 70 నాటౌట్) విధ్వంసకర అజేయ హాఫ్ సెంచరీతో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

128 పరుగులకే నేపాల్ ఆలౌట్:

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ అండర్-19 జట్టు భారత బౌలర్ల ధాటికి 42.3 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది. నేపాల్ బ్యాటర్లలో దర్ష్ సోనార్ (43) ఒక్కడే టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ (3/18), అర్జున్ రాజ్‌పుత్ (3/8) మూడేసి వికెట్లతో విరుచుకుపడగా.. యశ్వీర్ గౌడ్ రెండు, కావ్య మరియు మనాల్ చౌహాన్ తలో వికెట్ పడగొట్టారు.

సునాయసంగా ఛేదించిన ఆర్యవీర్, లక్ష్య:

అనంతరం 129 పరుగుల సులువైన లక్ష్యంతో బరిలోకి దిగిన భారత అండర్-19 జట్టు కేవలం 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 129 పరుగులు చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఓపెనర్‌గా వచ్చిన ఆర్యవీర్ సెహ్వాగ్ కేవలం 34 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, అతనికి జోడీగా నిలిచిన కెప్టెన్ లక్ష్య రాయ్‌చందని (63 బంతుల్లో 7 ఫోర్లతో 53 నాటౌట్) కూడా ఆచితూచి ఆడుతూ అర్ధశతకాన్ని అందుకున్నాడు. వీరిద్దరూ ఆఖరి వరకు అజేయంగా 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

ఈ విజయంతో గ్రూప్-ఏ లో భారత అండర్-19 జట్టు అగ్రస్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో భారత మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వే ద్రవిడ్ తుది జట్టులో ఉన్నప్పటికీ వికెట్లు పడకపోవడంతో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం లభించలేదు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో ఆదివారం సాంప్రదాయ ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.

యూత్ ఒలింపిక్స్‌లో భారత ఈతగాళ్ల సంచలనం

స్విమ్మింగ్ పోటీల్లో ధనిధి దేసింగు, తీర్థాంక్ పెగులకు కాంస్య పతకాలు!

200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రెండో కాంస్యం సాధించి చరిత్ర సృష్టించిన 16 ఏళ్ల ధనిధి దేసింగు

యూత్ ఒలింపిక్స్ వ్యక్తిగత విభాగాల్లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా రికార్డు

200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో కాంస్యంతో మెరిసిన తీర్థాంక్ పెగు; భారత్‌కు దక్కిన 6వ పతకం


బలగం టీవీ, క్రీడా విభాగం:

డాకర్, నవంబర్ 6:

సెనెగల్ రాజధాని డాకర్ వేదికగా జరుగుతున్న 'యూత్ ఒలింపిక్ గేమ్స్' స్విమ్మింగ్ పోటీల్లో భారత ఈతగాళ్లు అద్భుత ప్రతిభతో దేశ కీర్తిపతాకాన్ని ఎగురవేశారు. శుక్రవారం జరిగిన బాలికల 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో భారత యువ ఈతగాడు ధినిధి దేసింగు (Dhinidhi Desinghu) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

ఇప్పటికే 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్యం సాధించిన 16 ఏళ్ల ధనిధి, ఈ రెండో పతకంతో యూత్ ఒలింపిక్స్ వేదికగా వ్యక్తిగత విభాగాల్లో రెండు పతకాలు సాధించిన మొదటి భారతీయ అథ్లెట్‌గా కొత్త చరిత్ర లిఖించింది. 200 మీటర్ల ఫైనల్ రేసులో ధనిధి 2:02.28 నిమిషాల వ్యవధిలో రేసును పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో చైనాకు చెందిన ఎమ్. ఛాంగ్ (1:59.59) స్వర్ణం గెలవగా, క్రొయేషియాకు చెందిన అనా బొబానోవిక్ (2:01.17) రజతం దక్కించుకుంది.





పురుషుల విభాగంలో తీర్థాంక్ పెగు రికార్డు:

అనంతరం జరిగిన పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో మరో భారత ఈతగాడు తీర్థాంక్ పెగు (Tirthank Pegu) కాంస్య పతకంతో మెరిసాడు. ఫైనల్ రేసును 2:01.25 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచిన పెగు, యూత్ ఒలింపిక్స్ స్విమ్మింగ్ పోటీల్లో పతకం సాధించిన తొలి భారతీయ పురుష స్విమ్మర్‌గా రికార్డు నమోదు చేశాడు.

ఈ విభాగంలో కొలంబియాకు చెందిన నికోలస్ కోకిడ్కో (2:04.14) స్వర్ణ పతకాన్ని, ఈజిప్ట్‌కు చెందిన జైన్ అలీ (2:04.31) రజత పతకాన్ని గెలుచుకున్నారు. ప్రస్తుత యూత్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇది 6వ పతకం కావడం విశేషం.

హాకీ ఇండియా ఎన్నికలకు ఒడిశా హైకోర్టు స్టే..

షోకాజ్ నోటీసులపై మధ్యంతర ఉత్తర్వులు!

డిసెంబర్ 5న జరగాల్సిన ఎన్నికలు నిలిపివేత..

డిసెంబర్ 9కి తదుపరి విచారణ వాయిదా

అసోసియేట్ మెంబర్‌గా మార్చాలన్న ప్రతిపాదనపై 'హాకీ ఒడిశా' పిటిషన్ దాఖలు

అధ్యక్షుడు దిలీప్ టిర్కీ వర్సెస్ సెక్రటరీ జనరల్ భోలానాథ్ సింగ్ మధ్య పెరుగుతున్న అంతర్గత విభేదాలు

బలగం టీవీ, క్రీడా విభాగం:

దేశంలో అత్యున్నత హాకీ పాలకమండలి అయిన 'హాకీ ఇండియా' (Hockey India)కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. డిసెంబర్ 5న జరగాల్సిన హాకీ ఇండియా ఎన్నికలపై ఒడిశా హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. అదేవిధంగా, 'హాకీ అసోసియేషన్ ఆఫ్ ఒడిశా' (HAO)ను శాశ్వత సభ్యత్వం నుంచి అసోసియేట్ సభ్యుడిగా మార్చాలని కోరుతూ జారీ చేసిన షోకాజ్ నోటీసును కూడా కోర్టు నిలిపివేసింది.

జస్టిస్ ఆర్.కె. పట్నాయక్‌తో కూడిన ధర్మాసనం ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 6న జరిగిన హాకీ ఇండియా 120వ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం నిర్ణయాలను, అక్టోబర్ 7న జారీ చేసిన షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ హాకీ అసోసియేషన్ ఆఫ్ ఒడిశా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

నిబంధనలను పాటించలేదనే కారణంతో అక్టోబర్ 7న హాకీ ఇండియా.. ఒడిశా రాష్ట్ర అసోసియేషన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. రాష్ట్రంలోని 30 జిల్లా సంఘాలలో ఎన్నికల ద్వారా అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోవాల్సింది పోయి, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్లు, సబ్-కలెక్టర్ల వంటి అధికారిక అధికారులు ఎక్స్-అఫిషియో హోదాలో కొనసాగుతున్నారని హాకీ ఇండియా అభ్యంతరం వ్యక్తం చేసింది. జిల్లా యూనిట్లు తమ ఎన్నికల వివరాలను సమర్పించలేదని పేర్కొంది.మరోవైపు, హాకీ ఇండియా ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ కమిటీ గడువు సెప్టెంబర్ 30తోనే ముగిసిపోయిందని, కాబట్టి ఈ షోకాజ్ నోటీసు చట్టబద్ధంగా చెల్లదని రాష్ట్ర అసోసియేషన్ వాదించింది. విచారణ సందర్భంగా.. 2018 నుంచి భారత జాతీయ జట్లకు ప్రధాన అధికారిక స్పాన్సర్‌గా ఉన్న ఒడిశా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలను రాష్ట్ర అడ్వకేట్ జనరల్ పి. ఆచార్య కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.హాకీ ఇండియా అధ్యక్షుడు, ఒడిశాకు చెందిన మాజీ ఎంపీ దిలీప్ టిర్కీ (Dilip Tirkey) మరియు సెక్రటరీ జనరల్ భోలానాథ్ సింగ్ మధ్య పాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర స్థాయి విభేదాలు కొనసాగుతున్నాయి.

జెర్సీ రంగు మార్పు వివాదం: ఎఫ్ఐహెచ్ (FIH) వరల్డ్ కప్ ముందు భారత జట్టు జర్సీ రంగును సాంప్రదాయ నీలం రంగు నుంచి కాషాయానికి మార్చడంపై అధ్యక్షుడికి తెలియకుండానే నిర్ణయం జరిగిందని దిలీప్ టిర్కీ అభ్యంతరం వ్యక్తం చేయగా, భోలానాథ్ దీనిని ఖండించారు.డైరెక్టర్ జనరల్ సస్పెన్షన్: హాకీ ఇండియా డైరెక్టర్ జనరల్ సిడిఆర్.కె. శ్రీవాస్తవకు టిర్కీ షోకాజ్ నోటీసు జారీ చేసి బాధ్యతల నుంచి తొలగించడంపై సెక్రటరీ జనరల్ అభ్యంతరం తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ మీటింగ్: అధ్యక్షుడి ముందస్తు అనుమతి లేకుండానే 120వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని భోలానాథ్ నిర్వహించారని టిర్కీ ఆరోపించారు.ఈ పరిణామాల నేపథ్యంలో డిసెంబర్ 5న జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ కోర్టు స్టే కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయింది. హాకీ ఇండియా తదుపరి ఏ విధంగా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

నవంబర్ 14, 15 తేదీల్లో భువనేశ్వర్‌లో 'ఆసియా రగ్బీ U-20 సెవెన్స్' టోర్నీ!

కళింగ స్టేడియం వేదికగా 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒడిశాలో అంతర్జాతీయ రగ్బీ సమరం

భారత పురుషుల, మహిళల జట్లను ప్రకటించిన రగ్బీ ఇండియా.. కెప్టెన్లుగా పుష్పేందర్, తనుశ్రీ భోసలే

10 దేశాలు పోటీపడనున్న ప్రతిష్టాత్మక ఖండాతర ఛాంపియన్‌షిప్

బలగం టీవీ, క్రీడా విభాగం:

ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ప్రముఖ 'కళింగ స్టేడియం' వేదికగా అంతర్జాతీయ రగ్బీ సమరానికి తెరలేవనుంది. నవంబర్ 14, 15 తేదీలలో 'ఆసియా రగ్బీ ఎమిరేట్స్ అండర్-20 సెవెన్స్ ఛాంపియన్‌షిప్ 2026' టోర్నమెంట్‌కు భువనేశ్వర్ ఆతిథ్యమివ్వనుంది. 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒడిశాలో మళ్లీ అంతర్జాతీయ రగ్బీ టోర్నీ జరుగుతుండటం విశేషం. చివరిసారిగా 2018లో ఒడిశా వేదికగా ఆసియా రగ్బీ U-18 గర్ల్స్ సెవెన్స్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించారు.

ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో పాల్గొనే భారత అండర్-20 పురుషుల, మహిళల జట్లను 'రగ్బీ ఇండియా' శుక్రవారం ప్రకటించింది. పురుషుల విభాగంలో 10 దేశాలు, మహిళల విభాగంలో 7 దేశాలు పోటీ పడనున్నాయి. భారత్, హాంకాంగ్ చైనా, శ్రీలంక, మలేషియా, ఉజ్బెకిస్తాన్, థాయిలాండ్, సింగపూర్, చైనీస్ తైపీ, నేపాల్, జోర్డాన్ దేశాల జట్లు ఈ టోర్నీలో తలపడనున్నాయి.

గత 2025 సీజన్‌లో బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన టోర్నీలో కాంస్య పతకం సాధించిన భారత మహిళల జట్టు, ఈసారి స్వదేశంలో గోల్డ్ మెడల్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

భారత జట్ల వివరాలు:

పురుషుల జట్టు

పుష్పేందర్ (కెప్టెన్), రాజన్ రావత్ (వైస్ కెప్టెన్), అజిత్ నాగ్, అమన్, అరుణ్ ప్రజాపత్, భరత్ కిసాన్, విద్యాధర్ మాఝి, చరణ్ హెంబ్రమ్, నమన్ యాదవ్, రాహుల్ మాఝి, రోహిత్ కుమార్, సుభాష్ హన్సా.

మహిళల జట్టు

తనుశ్రీ భోసలే (కెప్టెన్), మమలి సింగ్ (వైస్ కెప్టెన్), అక్షయ ఎన్ఎస్, అనిత ముర్ము, అనుష్క సంక్పాల్, దీపాలి తాతే, ఖుషీ దేవి, కీర్తి జాధవ్, అదితి సఖారామ్ లోంధే, సలోని కుమారి, సమృద్ధి కదమ్, సుమిత్ర ముర్ము.